





# కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

సోమవారం 20, ఏప్రిల్ 2026 | 16 పేజీలు


బడిబాట పట్టేలా 2లో
















## తనిఖీలు మరిచారా...!



2లో

తొలుత హడావిడి..

ప్రస్తుతం సైలెంట్

బ్లాక్ మార్కెట్లో విచ్చలవిడిగా డొమెస్టిక్ సిలిండర్ల అమ్మకాలు

మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్న జిల్లా యంత్రాంగం



# తనిఖీలు మరిచారా...!

**తొలుత హడావిడి.. ప్రస్తుతం సైలెంట్**

**బ్లాక్ మార్కెట్లో విచ్చలవిడిగా డొమెస్టిక్ సిలిండర్ల అమ్మకాలు**

**మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్న జిల్లా యంత్రాంగం**



**పెద్దపల్లి, ప్రభాతవార్త:** జిల్లాలో గ్యాస్ మాఫియా అడ్డూఅదుపు లేకుండా రెచ్చిపోతోంది. సామాన్యుడి ఆకలి తీర్చాల్సిన గృహ వినియోగ (డొమెస్టిక్) సిలిండర్లు దారి మళ్లుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సబ్సిడీ సిలిండర్లు యథేచ్ఛగా హోటళ్లు, వాణిజ్య కేంద్రాలకు చేరుతున్నాయి. తొలుత హడావిడి చేసిన అధికారులు, ప్రస్తుతం 'సైలెంట్' అయిపోవడం వెనుక భారీస్థాయిలో 'మామూళ్ల' హస్తం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్లాక్ మార్కెట్‌లో సిలిండర్ ధర రూ. 3000! అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధ వాతావరణాన్ని సాకుగా చూపి జిల్లాలో కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. సామాన్యుడు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే వారాల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ, అదనపు సొమ్ము చెల్లిస్తే మాత్రం గంటల వ్యవధిలోనే సిలిండర్లు డెలివరీ అవుతున్నాయి. ఒక్కో డొమెస్టిక్ సిలిండర్‌ను బ్లాక్ మార్కెట్‌లో రూ. 2500 నుండి రూ. 3000 వరకు విక్రయిస్తూ అక్రమార్కులు సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు. కమర్షియల్ మాఫియా.. అధికారుల మౌనం వాణిజ్య సిలిండర్ల ధర రూ. 6000 వరకు పలుకుతుండటంతో, హోటల్ నిర్వాహకులు తక్కువ ధరకు లభించే గృహ వినియోగ సిలిండర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ హౌస్‌లు, రెస్టారెంట్లలో ఎక్కడ చూసినా డొమెస్టిక్ సిలిండర్లే దర్శనమిస్తున్నాయి. కళ్లముందే అక్రమాలు జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. క్షేత్రస్థాయిలో అధ్వాన్న పరిస్థితి ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం నిలిచి పోవడం, టోల్ ఫ్రీ నంబర్లు పనిచేయకపోవడంతో వినియోగదారులు ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గ్యాస్ అందక సామాన్యులు కట్టెల పొయ్యిపై వంట చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్యాస్ ఏజెన్సీల అండదండలతోనే ఈ బ్లాక్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోందని బాధితులు ఆరోపిస్తున్నారు. తక్షణమే దాడులు నిర్వహించాలి జిల్లా స్థాయిలో ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి హోటళ్లు, కమర్షియల్ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం నిద్ర మేల్కొంటుందో లేక 'మామూల్లు'గానే వ్యవహరిస్తుందో వేచి చూడాలి.

## కొండగట్టులో అభివృద్ధి కోసం

# అంజన్న భక్తుల అల్టిమేటం !

**సదుపాయాల లేమి పై భక్తుల అసంతృప్తి**

**అభివృద్ధి జరగనప్పుడు హుండీలో డబ్బులు వేయమని హెచ్చరిక**

**కలకలం రేపిన అంజన్న భక్తుల లేఖాస్త్రం!**

**మల్యాల/ ప్రభాతవార్త :** కొలిచే భక్తుల కొంగు బంగారం కోరిన వరాలిచ్చే కొండగట్టు అంజన్న సన్నిధిలో మౌలిక సదుపాయాలు లేక భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంద ని ఓ భక్తుడు తమ దస్తూరితో కూడిన లేఖాస్త్రాన్ని సంధించాడు, ఈ లేఖ ఆలయ ఉండే ఆదాయం లెక్కింపు సందర్భంగా బయటపడడం వైరల్ కావడం కలకలం సృష్టించింది, కొండగట్టు అంజన్న ఆదాయానికి భక్తుల ద్వారా ఎంతో ఆదాయం వస్తున్న కూడా ఇక్కడ కనీస సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు, ముఖ్యంగా శుభ్రత, మౌలిక సదుపాయాలు కూడా లేవని , కోనేరు వద్ద పరిశుభ్రత కరువైందని, ఆలయ పరిసరాల్లో కూడా పరిశుభ్రత లేకపోవడం అసౌకర్యానికి గురవుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు, అంతేకాకుండా భక్తులకు మరుగుదొడ్లు తగినన్ని లేకపోవడం ఉన్నవాటి శుభ్రత లేక కంప కొడుతున్నాయని, పరిసరాల్లో శుభ్రత లేక కనీసం నడవడానికి కూడా ఇబ్బందిగా మారిందని, ఆలయం తరఫున భక్తులకు తాగు రెడ్డి సదుపాయం కోనేరు వద్ద శుభ్రత మరుగుదొడ్లు తగినన్ని ఏర్పాటు చేసి మౌలిక వసతులను కల్పించాలని ఈ సందర్భంగా అధికారులను వేడుకున్నాడు, అంతేకాకుండా ఆలయంలో పూర్తిస్థాయిలో భక్తులకు సదుపాయాలు కల్పించేంతవరకు హుండీలో డబ్బులు వేయడం నిలిపివేసి, అదే డబ్బులతో గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల అభివృద్ధికి వినియోగించుకుంటామని కూడా అల్టిమ్నేటఇవ్వడం కోస మెరుపు!, హనుమాన్ భక్తుల పేరిట ఈ లేఖ హుండీలో వేసి తన ఆవేదన ను వెల్లపోసుకున్నారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి కొండగట్టు ఆలయంలో భక్తుల కనీస వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటే హనుమాన్ భక్తుల కు న్యాయం చేసినట్లే మరి !



# ఆకలి తీర్చాల్సిన సన్నం..

**అక్రమార్కులకు లాభాల స్వర్ణం!**

**ప్రభుత్వ బియ్యం పక్కదారి!**

**లబ్ధిదారుల నిర్లక్ష్యంతో డీలర్ల దందా**

**రెవెన్యూ, పౌర సరఫరాల అధికారుల చేతివాటం**

**గోదావరిఖని, ప్రభాతవార్త:** పేదల ఆకలి తీర్చాల్సిన ప్రభుత్వ సన్నబియ్యం అక్రమ మార్గాల్లోకి జారిపోతూ దందాగా మారుతోంది. రేషన్ దుకాణాల వద్ద జరుగుతున్న అక్రమాలపై పర్యవేక్షణ సడలిపోవడంతో డీలర్లు, మధ్యవర్తులు కలిసి వ్యవస్థను దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారులు బియ్యం తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపకపోవడం ఈ అక్రమాలకు ప్రధాన కారణంగా మారింది. జిల్లాలో సుమారు 300 రేషన్ దుకాణాల ద్వారా దాదాపు 1.50 లక్షల కార్డుదారులకు ప్రతి నెలా సుమారు 3 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ అవుతోంది. ప్రస్తుతం మూడు నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి అందజేస్తుండడంతో నిల్వలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని కొందరు డీలర్లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ఈ పాస్ యంత్రంలో వేలిముద్ర వేసి బియ్యం తూకం వేసిన వెంటనే, "మీకు అవసరం లేకపోతే మాకు ఇవ్వండి" అంటూ కిలోకు నిర్దిష్ట ధర చెప్పి అక్కడికక్కడే తిరిగి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. కొన్ని చోట్ల అయితే బియ్యం ఇవ్వకుండా నగదు పంపిణీ కూడా జరుగుతోందని లబ్ధిదారులు చెబుతున్నారు. ఇలా తక్కువ ధరకు సేకరించిన బియ్యాన్ని అక్రమార్కులు ఎక్కువ ధరలకు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. మండలాలతో పోలిస్తే పట్టణాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రమైందని అధికారులు అంగీకరిస్తున్నారు. గుట్టుగా సాగుతున్న కొనుగోళ్లు అక్రమార్కులు ద్విచక్ర వాహనాలు, ఆటోలపై తిరుగుతూ కిలో రూ.12 నుంచి 15 వరకు చెల్లించి బియ్యం సేకరిస్తున్నారు. కొందరు డీలర్లతో ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకుని పెద్ద ఎత్తున నిల్వలు కూడబెట్టుకుంటున్నారు. సేకరించిన బియ్యాన్ని గోదాముల్లో నిల్వచేసి, తర్వాత ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు సమాచారం. గోదావరిఖని అడ్డగుంటపల్లి కేంద్రంగా ఈ అక్రమ రవాణా కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. రామగుండం, ఎన్‌టిపిసి, 8వ కాలనీ ప్రాంతాల నుంచి బియ్యం సేకరించి గంగానగర్ బ్రిడ్జి మీదుగా ఆటోలు, చిన్న వాహనాల్లో తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ రవాణా ఎక్కువగా జరుగుతుండటంతో గుర్తించడం కష్టమవుతోంది. మహారాష్ట్ర లోని సిరోంచ బాట పడుతున్న బియ్యం సేకరించిన బియ్యాన్ని మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడి పోడ్సా మార్కెట్లలో ఈ బియ్యానికి డిమాండ్ ఉండటంతో అక్రమార్కులు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారని సమాచారం. రవాణా సమయంలో పర్యవేక్షణ లేకపోవడం కూడా వారికి అనుకూలంగా మారింది. మిల్లర్ల దోపిడీ కూడా ఇదిలా ఉండగా, కొందరు రైస్ మిల్లర్లు కూడా ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)ను పూర్తిగా ఇవ్వకుండా, కొంత భాగాన్ని కోళ్ల దాణా, ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విధంగా వారు కూడా అదనపు లాభాలు పొందుతున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి. పర్యవేక్షణ లోపమే కారణం ఈ మొత్తం వ్యవహారానికి పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని నిపుణులు అంటున్నారు. రేషన్ దుకాణాలపై తరచూ తనిఖీలు నిర్వహించకపోవడం, లబ్ధిదారుల అవగాహన లోపం, డీలర్లపై కఠిన చర్యలు లేకపోవడం అక్రమాలకు దారితీస్తున్నాయి. చర్యలు అవసరం ఈ నేపథ్యంలో అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. రేషన్ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు, అక్రమ రవాణాపై ప్రత్యేక దళాల ఏర్పాటు, లబ్ధిదారుల్లో అవగాహన పెంపు ద్వారా మాత్రమే ఈ దందాను అరికట్టవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పేదల కోసం ఉద్దేశించిన అన్నం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లకుండా కట్టడి చేయడం ప్రభుత్వ యంత్రాంగానికి సవాల్‌గా మారింది.






# బడిబాట పట్టేలా..

**జూన్ 12 వరకు కార్యక్రమం**

**ప్రభుత్వ ఉపాధ్యాయుల ముమ్మర ప్రచారం**

**ప్రవేశాల పెంపే లక్ష్యంగా పోస్టర్లు, కరపత్రాలు**

**ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నాలు**

**మల్లాపూర్ ప్రభాతవార్త :** వేసవి సెలవులు వచ్చాయంటే ఏ గల్లికి వెళ్లిన ప్రైవేటు పాఠశాలల సిబ్బంది కనిపిస్తారు. పిల్లలను తమ స్కూలులో చేర్చాలని తల్లిదండ్రులను కోరుతుంటారు. ఆ పరిస్థితులకు భిన్నంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తమ పాఠశాలలో చేర్పించండి అంటూ ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల పెంపే లక్ష్యంగా ప్రభుత్వం ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు బడిబాట నిర్వహించాలని ఆదేశించింది. గత ఏడాది హెచ్‌ఎం ప్రధానోపాధ్యాయులులు, ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటీల సహకారంతో స్వచ్ఛందంగా బడిబాట నిర్వహించి విద్యార్థుల పెంపే లక్ష్యంగా పనిచేశారు. విద్యార్థుల గుర్తింపు..సాధారణంగా ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని జూన్ రెండవ తేదీ నుంచి నిర్వహిస్తుంది. ఈ ఏడాది మాత్రం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ముందస్తుగా కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రస్తుతం ఒంటిపూట బడులు కొనసాగుతున్న నేపథ్యంలో ఉదయం ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య బడిబాట చేపడుతున్నారు. బడి బయట ఉన్న పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే వారిని గుర్తిస్తున్నారు. పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు డిజిటల్ తరగతులు గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు నోట్బుక్కులు యూనిఫాం అందిస్తున్నామని చెబుతున్నారు. నాణ్యమైన విద్య అందిస్తామని ఏఐ ద్వారా బోధిస్తామని హామీ ఇస్తున్నారు. ఆంగ్లంలో బోధన, ప్రతి నెల తల్లిదండ్రుల సమావేశం.. ఇలా పలు అంశాలను ఎజెండాగా ఎంచుకొని ప్రచారం చేస్తున్నారు. సౌకర్యాలపై కరపత్రాలు చిన్నపాటి పోస్టర్లను ముద్రించారు. ప్రవేశాల పెంపునకు కృషి కేతిరి దామోదర్ రెడ్డి, ఎంఈఓ మల్లాపూర్. ప్రజా పాలన ప్రగతి ప్రణానికలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో కలిసి ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు డిజిటల్ తరగతులు పాఠ్య పుస్తకాలు, నోటుబుక్కులు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్ తదితర అంశాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రవేశాలు పెంచేలా ప్రయత్నం చేస్తున్నాం. మండలంలో విస్తృతంగా ప్రచారం చేశాం భూమేష్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లాపూర్ మండలంలో పలు. ప్రధాన రోడ్డుల వెంబట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విద్యార్థుల ఉన్నత మార్కులతో కూడిన విద్యార్థుల ఫోటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి మండలంలో ప్రచారం విస్తృతంగా నిర్వహిస్తున్నామని ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణతో పాటు అలవాటు పడుతుందని ప్రభుత్వ పాఠశాల ముద్దు అని అన్నారు.

# రత్నాపూర్ ఆర్ అండ్ ఆర్ సైట్ డ్రైనేజ్‌కు రూ.1.86 కోట్లు మంజూరు

### కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు

రామగిరి ప్రభాతవార్త:



ఆర్ జి 3 డివిజన్ పరిధిలోని రత్నాపూర్ గ్రామపంచాయితీ పరిధిలోని సింగరేణి ఆర్ అండ్ ఆర్ సైట్ లో డ్రైనేజీ నిర్మాణానికి యాజమాన్యం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రూ.1.86 కోట్ల నిధులు మంజూరు చేస్తూ సిఅండ్ఎండి డా.జ్యోతి ప్రకాష్ బుద్దే ఉత్తర్వులు జారీ చేశారని జీఎం సుంకర మధుసూదన్ తెలిపారు. లద్నాపూర్ పాత, కొత్త ఆర్ అండ్ ఆర్ సైట్ లో డ్రైనేజీ లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, రత్నాపూర్ పాఠశాల వెనుక పొలాలు మునిగి పోతున్నాయని, 19.12.2025 న సెంటినరీ కాలనీ జేఎన్టీయూ కళాశాల లో ఓసీపీ1 మెగా ప్రాజెక్ట్ పబ్లిక్ హియరింగ్ లో సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ఇక్కడి ఇబ్బందులను వివరించారు. అదే విధంగా 12.01.2026 రోజున ఆర్ అండ్ ఆర్ కాలనీ మురికి నీరు, వరద నీరు తో ఇబ్బందులు కలుగకుండా డ్రైన్ నిర్మించాలని, ప్రభుత్వ పాఠశాలకు పొంచి ఉన్న ప్రమాదమని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందించారు. దీనితో స్పందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తేదీ: 06.01.2026 రోజున ఆర్ అండ్ ఆర్ సైట్ లను, రత్నాపూర్ పాఠశాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలనీ సింగరేణి యాజమాన్యానికి 24.01.2026 రోజున లేఖ వ్రాసారు. ఆర్జీ3 జీఎం సుంకర మధుసూదన్, సివిల్ డిజిఎం బి.రాజేంద్ర కుమార్ తేదీ: 07.02.2026 రోజున ఆర్ అండ్ ఆర్ సైట్ ఇబ్బందులను పరిశీలించారు. వీరి ప్రతిపాదనలతో సింగరేణి యాజమాన్యం ఈ నిధులను మంజూరు చేసింది. పాత లద్నాపూర్ ఆర్ అండ్ ఆర్ సైట్ నుండి కొత్త ఆర్ అండ్ ఆర్ సైట్ మీదుగా, రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న కల్వర్ట్ వరకు భారీ డ్రైనేజీ నిర్మించాలని నిధులు మంజూరు చేశారు. 850 మీటర్ల దూరంతో 4 ఫీట్ల నుండి 6 ఫీట్ల మధ్య వెడల్పు తో ఈ డ్రైనేజీ నిర్మాణం జరుగనుంది. దీనితో ఆర్అండ్ఆర్ సైట్ లో ప్రజలకు భారీ డ్రైనేజీ సమస్య తీరనుంది. నిధులు మంజూరు కు సహకరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, సీఅండ్ఎండీ జ్యోతి ప్రకాష్ బుద్దే, డైరెక్టర్ లు ఎల్.వి.సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, మోకాళ్ళ తిరుమల రావు, ఆర్జీ3 జీఎం సుంకర మధుసూదన్ కు స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు కృతజ్ఞతలు తెలిపారు.

## మెట్‌పల్లిలో గంజాయి ముఠా గుట్టురట్టు

### -ఇద్దరు యువకులు అరెస్ట్

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:

యువతను మత్తు పదార్థాల బారిన పడేస్తున్న గంజాయి ముఠాపై మెట్పల్లి పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. వైఎస్సార్ అర్బన్ కాలనీని కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రయాలు సాగిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, మెట్ పల్లి చెందిన మల్యాల చందు, కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన బాణాల రాజు కలిసి ఒక ముఠాగా ఏర్పడి గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాల్లో నిమగ్నమయ్యారు. వీరు మెదక్ ప్రాంతానికి చెందిన వ్యక్తి నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి పట్టణంలోని యువత, విద్యార్థులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది.పక్కా సమాచారంతో మెట్పల్లి ఎస్ఐ పి. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం వైఎస్సార్ అర్బన్ కాలనీలో మెరుపు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా నిందితులు గంజాయి ప్యాకింగ్ చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి సుమారు 140 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.విచారణలో నిందితులు మెదక్ ప్రాంతం నుంచి గంజాయి సరఫరా పొందుతున్నట్లు అంగీకరించారు. అదేవిధంగా, వీరిద్దరిపై గతంలో కూడా గంజాయి కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

### గంజాయి సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు

**-మెట్ పల్లి ఎస్సై పబ్బ కిరణ్ కుమార్**



గంజాయి కలిగి ఉండటం, రవాణా చేయడం, విక్రయించడం లేదా వినియోగించడం చట్టరీత్యా నేరం ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మెట్ పల్లి ఎస్సై కిరణ్ హెచ్చరించారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.

## ముగ్గురిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు

**-మానకొండూర్ సిఐ శ్రీలత**

మానకొండూర్: ప్రభాతవార్త :



మానేరు వాగులో నుండి ఇసుక అక్రమ రవాణాపై అధికారులకు సమాచారం అందిస్తున్నాడనే అను మానంతో ఓ దళిత యువకుడిపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం, బస్టాండ్ చౌరస్తాలో గొడ్డలితో దాడికి యత్నించి, కులం పేరుతో దూషిస్తూ చంపుతామని బెదిరించిన ఘటనలో ముగ్గురి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినట్లు మానకొండూర్ సిఐ పి.శ్రీలత తెలిపారు. మానకొం డూరు సిఐ తెలిపిన వివరాల ప్రకారం..మానకొండూర్ మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన హరీష్ అనే యువకుడు ఈ నెల 17న ఉదయం గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం, బస్టాండ్ చౌరస్తా సమీపంలో గ్రామస్తులతో మాట్లాడుతుండగా..అదే గ్రామానికి చెందిన సాయికుమార్ గౌడ్ ,అనిల్ గౌడ్ ,శ్రీనివాస్ గౌడ్ అనే ముగ్గురు అక్కడికి చేరుకున్నారు. గ్రామ మానేరు వాగులో నుండి ఇసుక అక్రమ రవాణా పై హరీష్ అధికారులకు సమాచారం ఇస్తున్నాడనే అనుమానంతో అతడిని కులం పేరుతో దూషిస్తూ ఇంట్లో నుండి గొడ్డలి తీసుకువచ్చి గ్రామస్తుల సాక్షిగా అందరూ ముందే గొడ్డలితో దాడికి యత్నించారు.ముగ్గురు నిందితులు హరీష్‌ను ఉద్దేశపూర్వకంగా కులం పేరుతో అసభ్య పదజాలంతో దూషిస్తూ,చంపుతామని బెదిరించారని, నిందితుడు సాయికుమార్ తన ఇంటి నుండి గొడ్డలిని తీసుకువచ్చి హరీష్‌పై దాడి చేయడానికి ప్రయత్నించాడని,మిగిలిన ఇద్దరు నిందితులు హరీష్‌ను పట్టుకుని దాడి చేశారని తెలిపారు.దాడి జరిగే సమయంలో అక్కడే ఉన్న గ్రామస్తులు రవి,రాజయ్య,పవన్,సారయ్యలు వెంటనే స్పందించి అడ్డుకోవడంతో హరీష్‌కు ప్రాణాపాయం తప్పిందన్నారు.బాధితుడు హరీష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీలత తెలిపారు. వెల్ది గ్రామంలో ఇసుక మాఫియా రోజురోజుకు రెచ్చిపోతున్నారని, వారి ఆగడాలకు అడ్డు లేకుండా పోతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

# ఆటో బైక్ ఢీ ..

## ఎల్ఐసి ఏజెంట్ కుసుమ శ్రీనివాస్ మృతి

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;



జమ్మికుంట పట్టణానికి చెందిన ఎల్ఐసి ఏజెంట్ కుసుమ శ్రీనివాస్ (58) హనుమకొండలో జరిగిన యాక్సిడెంట్‌లో ఆదివారం సాయంత్రము అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రత్యక్ష సాక్షులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం జమ్మికుంట నుండి తన బైక్ పై భార్యాభర్తలిద్దరూ హనుమకొండలోని ఒక పెండ్లికి హాజరై తిరిగి జమ్మికుంటకు వస్తున్న తరుణంలో ఎర్రగట్టు గుట్ట దాటిన తర్వాత వెనుక నుండి ఒక ఆటో, బైక్ ను ఢీకొనడం వలన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. తన భార్య ఇందిరా సీరియస్ గా ఉండడంతో హన్మకొండలోని ఆదిత్య హాస్పిటల్ లో చేర్పించారు. శ్రీనివాస్ కు కూతురు, కుమారుడు ఉన్నారు. ఇల్లందకుంట మండలము సీతంపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్ జమ్మికుంటలో స్థిరపడ్డాడు. స్థానిక బస్టాండ్ కు ఎదురుగా రంజిత్ టైలర్, మొబైల్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఆయన హఠాత్ మరణంతో పిల్లలు దిక్కులేని వారు అయ్యారని బంధువులు రోధిస్తున్నారు. విషయం తెలుసుకున్న హుజురాబాద్, జమ్మికుంట లియోపి అధ్యక్ష, కార్యదర్శులు మొకిరాల సంపత్ రావు, మునిగాల సమ్మా రావు, కోశాధికారి గంటా సంపత్ లు వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలో ఉన్న మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించి, ఆ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుసుమ శ్రీనివాస్ మరణం పట్ల ఎల్ఐసి ఏజెంట్లు తమ ప్రగడ సానుభూతిని తెలిపారు.




## హాల్ టికెట్ ఇవ్వలేదన్న మనస్థాపంతో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

### కాలేజీ ముందు ధర్నా చేసిన విద్యార్థులు, బంధువులు

గొల్లపల్లి, ప్రభాతవార్త:



గొల్లపల్లి, ప్రభాతవార్త:హాల్ టికెట్ ఇవ్వలేదన్న మనస్థాపంతో బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గొల్లపల్లి మండల కేంద్రంలో విషాదాన్ని మిగిల్చింది. మండల కేంద్రానికి చెందిన మ్యాదరి ప్రణీత్ (20) హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం నుంచి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉండగా, ఫీజు చెల్లించలేదన్న కారణంతో కాలేజీ యాజమాన్యం హాల్ టికెట్ ఇవ్వలేదు. ప్రణీత్ తల్లిదండ్రులు మ్యాదరి రమేష్, మోనికలు పిల్లల చదువుల నిమిత్తం హైదరాబాదులో ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్ ఇస్తామని యాజమాన్యం స్పష్టం చేయడంతో సోమవారం ఫీజు చెల్లిస్తామని తల్లిదండ్రులు కాలేజీ యాజమాన్యానికి తెలియజేశారు.అయితే ఫీజు చెల్లించకపోతే హాల్ టికెట్ ఇవ్వబోమని కాలేజీ నుంచి ఫోన్ రావడంతో ప్రణీత్ తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం సాయంత్రం గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈ ఘటనపై బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తూ, ఫీజు చెల్లింపుల విషయంలో కాలేజీ యాజమాన్యం తీవ్ర ఒత్తిడి తీసుకురావడం వల్లే ఈ దారుణం జరిగిందని ఆరోపించారు. తల్లిదండ్రులతో మాట్లాడకుండా నేరుగా విద్యార్థికి ఫోన్ చేయడం అతడిని మరింత మనస్థాపానికి గురిచేసిందని పేర్కొన్నారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారుఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సోమవారం గొల్లపల్లి మండల కేంద్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఆదివారం మృతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించిన అనంతరం విద్యార్థి మృతదేహంతో కాలేజీ ముందు విద్యార్థులు, బంధువులు ధర్నాకు దిగారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థి మృతి స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

### .ప్రతిభ రికార్డుల గ్రంథంలో డా. పెరుక రాజుకు స్థానం

చందుర్తి ఏప్రిల్ 19: ప్రభాతవార్త




కవి, రచయిత, బహుభాషావేత్త డా. పెరుక రాజు కు అసాధారణ సాహిత్య ప్రతిభకు గుర్తింపుగా, ఆయన పేరు ప్రతిభా రికార్డుల గ్రంథం లో నమోదు అయింది. సామాజిక చైతన్యంతో కూడిన శక్తివంతమైన రచనల ద్వారా ఆయన చూపుతున్న విశిష్ట ప్రతిభకు ఈ గౌరవం లభించింది. సాధారణంగా వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభ కనపరచిన ముఖ్యుల్లో కొందరికి మాత్రమే స్థానం దక్కుతుంది.ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డా. రాజు కు స్మారక చిహ్నం (మెమెంటో), శాలువా, పతకం రికార్డు పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడుడా. రంజిత్, సుప్రీం కోర్టు జడ్జ్ బురుగుల మధుసూదనరావు చిత్ర దర్శకనిర్మాత జి. విజయ్ కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త రాజ శేఖర్, నిర్మాత విక్కు నాయక్, నటి నమ్రత, విద్యావేత్త ఆంజనేయులు తదితర సాహితీ, విద్యా రంగ ప్రముఖులు పాల్గొన్నారు. యువత, విద్యార్థులు, సాహిత్యాభిమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని,డా. రాజు గారిని పలువురు అభినందించారు.

### మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదు

– సీఐ రాం నర్సింహారెడ్డి

గొల్లపల్లి, ప్రభాతవార్త:

మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదని ధర్మపురి సిఐ రామ నరసింహారెడ్డి అన్నారు.గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవిందపల్లి వద్ద ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ. రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ ఎం. కృష్ణ సాగర్ రెడ్డి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముత్యాలవాడ బస్తీలో హిందూ సమ్మేళనం

**కోరుట్ల, ప్రభాతవార్త :**



కోరుట్ల పట్టణంలోని ముత్యాలవాడ బస్తీలో హిందూ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా లలిత సహస్ర నామ పారాయణంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కాశీ పీఠాధిపతి శ్రీ దండి స్వామి, ప్రధాన వక్త డాక్టర్ బి.శంకర్, మహిళా వక్త పూర్ణిమా చౌదరి స్థానిక వినాయక మందిరంలో దర్శనం చేసుకుని, గో పూజ తో పాటు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. చిన్నారుల భరత నాట్యం, తనుగుల రాజశేఖర్ గారి దేశ భక్తి గానం ఆహుతులను అలరించాయి. అనంతరం దండి స్వామి మాట్లాడుతూ మన హైందవ ధర్మం యొక్క గొప్పతనాన్ని విశిష్టతలను వివరించారు. ప్రతి తల్లి తన పిల్లలకు మన సనాతన ధర్మం యొక్క గొప్పతనాన్ని విశిష్టతలను వివరిస్తూ వాటిని ఆచరింపజేసి ఒక ఛత్రపతి శివాజీ, జిజియ భాయిలా తీర్చి దిద్దాలని దిశా నిర్దేశం చేశారు. ధర్మానికి గాని, దేశానికి గానీ ఆపద వస్తె ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, మనకు దైవ భక్తి ఎంత ముఖ్యమో దేశ భక్తి అంతకన్నా ముఖ్యమన్నారు. మహిళా వక్త పూర్ణిమా చౌదరి కుటుంబం, కుటుంబ యొక్క విశిష్టతలను వివరించారు. ప్రధాన వక్త కరినగర్ విభాగ్ సంఘచాలకులు డా. శంకర్ ఆర్ఎస్ఎస్ యొక్క ఏర్పాటుకు అవసరం అయిన పరిస్థితులను మరియు గత వంద సంవత్సరాల సంఘ ప్రయాణాన్ని, సమాజంలో ఆశించిన, సాధించిన విజయాలను తెలిపారు. ప్రతి తల్లి తమ పిల్లలను శాఖకు పంపించాలని అలా శాఖకు వెళ్లిన పిల్లలు క్రమశిక్షణతో పాటు మానసికంగా, శారీరకంగా వికాసం చెంది ప్రయోజకులు అవుతారని శాఖ యొక్క గొప్పతనాన్ని వివరించారు. అనంతరం అందరికీ అల్పాహార ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు శీలం జయలక్ష్మీ శ్రీ వేణుగోపాల్, పుప్పాల ఉమాదేవి ప్రభాకర్, టేకుల శిరీష నరేష్, గుగులావత్ శ్రీకాంత్, ఆర్ఎస్ఎస్ విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ రాజ గంగాధర్, నగర సహ్ బౌద్ధిక్ ప్రముఖ్ రొండి రవి, సమ్మేళన సమితి అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, కార్యదర్శి నీలి ఆంజనేయులు, కోశాధికారి గాంధారి సత్యనారాయణ, రాదరపు సత్యనారాయణ, మాడవేణి నరేష్, నీలి శ్రీనివాస్, చలిగంటి వినోద్, బోగ అజయ్, మనోజ్, కోనేటి వేణు, రాజశేఖర్, గుద్దేటి రాజేందర్, సతీష్ వివిధ కమిటీ సభ్యులు, హిందూ ధార్మికవేతలు, మహిళ ప్రతినిదులు, పటేల్ యూత్, యువత పాల్గొన్నారు.

కోరుట్ల వార్త



## అలరించిన వరాహ పురాణ సప్తాహం

### బ్రహ్మశ్రీ గర్రెపల్లి మహేశ్వరశర్మను సత్కరించిన భక్తులు

**కోరుట్ల, ప్రభాతవార్త :**




సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో గత వారం రోజులుగా జరుగుతున్న ఖిశ్రీ వరాహ మహాపురాణ సప్తాహంఖి భక్తులను అలరించింది. శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ చెప్పిన సప్తాహప్రవచనం ఆద్యంతం భక్తులను ఆకట్టుకున్నది. సముద్ర గర్భంలో రాక్షసులు దాచిన ధరణి మాతను రక్షించడానికి విష్ణుమూర్తి వరాహ పూర్తిగా అవతరించిన తీరు మహేశ్వరశర్మ వివరించారు. ధరణి మాతకు భూవరాహ మూర్తి వివరించిన ఎన్నో విషయాలను ఈ పురాణం ఆధారంగా భక్తులకు రమణీయంగా మన జీవితంలో మాయ, మోహం అనే అడ్డంకులను దాటితేనే అనుకున్న లక్ష్యాలను, ముక్తి మార్గాన్ని మనం సాధించగలమని మహేశ్వరశర్మ అద్భుతంగా వివరించారు. పురాణ ప్రవచన సప్తాహ ముగింపు సందర్భంగా ప్రత్యేక గురుపూజ, గురువందనం కార్యక్రమాలను శ్రద్ధ, భక్తులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు మంచాల జగన్, ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారాం, పురాణ కమిటీ చైర్మన్ పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పడిగెల శ్రీనివాస్, పురాణ కమిటీ కన్వీనర్ ఎలిమి బుచ్చన్న, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్ పడిగెల పవన్, నిర్వాహకులు రుద్ర సుధాకర్, మంచాల రాజలింగం, గుండేటి భృగు మహర్షి, గుంటుక ప్రకాష్, అల్లాడి ప్రవీణ్, తోకల రమేష్, ఎనగందుల రాజేంద్రప్రసాద్, చౌడారపు శ్రీనివాస్, ఎనగందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుని ప్రత్యేక పూజలు

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



ఇల్లంతకుంట మండలంలోని ముస్కాన్ పేటలో గల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలతో పాటు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూరదేవరాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచ్ జుట్టు శేఖర్, యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్, మాజీ సర్పంచ్ చింతలపల్లి రవీందర్ రెడ్డి, తిప్పారపు వంశీ, బోడ భూపతి రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## వేసవిలో తాగు నీటి సమస్యకు చెక్

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**

మండలములోని రేపాక గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ కాత మల్లేశం ఆధ్వర్యంలో మంచి నీటి సమస్యను తీర్చడానికి ఆదివారం గతములో మూలన ఉన్న బోర్లను సరి చేయించాడు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు పాత బోర్లను రిపేర్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోదాని మహేష్, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్, మీసాల రాజామోళి, గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మహిళా బిల్లు వ్యతిరేక వైఖరిపై బిజెపి నాయకుల నిరసన

**భీమారం, ప్రభాతవార్త :**



భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామంలో భారతీయ జనతా పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లుపై వ్యతిరేక వైఖరికి నిరసనగా ఆదివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వడ్లకొండ రాము మాట్లాడుతూ మహిళల సాధికారతకు కీలకమైన మహిళా బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మద్దతు ఇవ్వకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. మహిళల హక్కుల పరిరక్షణలో బీజేపీ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బూత్ అధ్యక్షులు వడ్లకొండ సాగర్, దుంపల మనోజ్ రెడ్డి, కటకం సాగర్, గంగాధర్ సుధావేణి, కటకం శ్రీనివాస్, పెద్దిరెడ్డి, బొడ్డు బక్కన్న, పడిగేలా గంగారెడ్డి, పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమి దిష్టి బొమ్మ దగ్ధం చేసిన బీజేపీ నాయకులు

**మేడిపల్లి, ప్రభాతవార్త :**

ఉమ్మడి మేడిపల్లి మండలంలో ఆదివారం రోజు మేడిపల్లి మండల అధ్యక్షులు చిట్యాల సురేష్, భీమారం మండల అధ్యక్షులు శివ కుమార్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు అడ్డంకులు సృష్టిస్తున్న కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి వైఖరికి నిరసనగా వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మహిళలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో తీసుకువచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్, ఇండియా కూటమి అడ్డుకోవడం మహిళలపై వారి కపట ప్రేమను బయటపెడుతోందని బీజేపీ మండల అధ్యక్షుడు చిట్యాల సురేష్ విమర్శించారు. మహిళల సాధికారతకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి వ్యవహరిస్తున్న తీరు ప్రజల ముందుకు వచ్చిందని, అందుకే ఈరోజు బీజేపీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి బీజేపీ సీనియర్ నాయకులు, ధర్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎస్ఎన్ రెడ్డీ, మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డీ, మండల ప్రధాన కార్యదర్శి గోస్కి మధు, మనోజ్ రెడ్డీ, మాజీ ఎంపీటీసీ రాజు, సీనియర్ నాయకులు చందా రమేష్, మాజి సర్పంచ్ బత్తుల రమేష్, టీవీ గణేష్, అల్లే రాజేష్, అదే రమేష్, లింగం పేట రమేష్, లింగం గౌడ్, హనుమాన్ చారి, నరేందర్ రెడ్డీ, శ్యామ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## లిటిల్ జీనియస్ హైస్కూల్లో పదవతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం

**కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :**



లిటిల్ జీనియస్ పాఠశాల పదవతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం కోరుట్ల లోని పిబి గార్డెన్స్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బండి మహాదేవ్ అధ్యక్షత ఈ కార్యక్రమం జరగగా, కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేశం పాల్గొని మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ విద్యను అందిస్తున్న లిటిల్ జీనియస్ ను అభినందించారు. విద్యార్థులను ఉన్నతంగా వుండాలని విలువలను పెంచుకుంటూ ఉత్తమంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. సందేశాత్మక , ఆలోచనాత్మకమైన సాంస్కృతిక కార్యక్రమాలతో ఆద్యంతం అలరించారు. ఈ కార్యక్రమంలో మాస్ట్రో కాలేజ్ కరస్పాండెంట్ ఆకుల రాజేశ్ , పిఆర్బిఎమ్ కాలేజ్ కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్, పాఠశాల హైస్కూల్ ప్రిన్సిపాల్ కలకుంట్ల రాధాకృష్ణ , పాఠశాల డైరెక్టర్ కొత్త రాజు , ఛీఫ్ అడ్వైజర్ కటుకం శంకర్ , ప్రైమరీ ప్రిన్సిపాల్ వినోద , ప్రీప్రైమరీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి , ఎడ్యుకేషనల్ సొసైటీ మెంబర్స్ లావణ్య , జ్యోతి , ఉపాధ్యాయులు బాడె సుధాకర్ , ప్రమీల , జీవిత , నరేష్ , మహేష్ , జగన్ , రాజేష్, సోహేల్ , గౌతమ్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిధులతోనే నేడు అభివృద్ధి పనులు

**-మంత్రి వివేక్ చెన్నూరుకు కొత్తగా చేసిందేమీ లేదు**
**-మాజీ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు బాల్క సుమన్**
**-బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు**

చెన్నూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతోనే నేడు మంత్రి వివేక్ వెంకటస్వామి అభివృద్ధి పనులు చేస్తున్నాడే తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వంలో తెచ్చిన నిధులతో కాదని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ అన్నారు. మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ తుమ్మ రమేష్ తో పాటు మరికొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు అయిన నిధులతో చెన్నూరు నియోజకవరంగంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నేనే అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి వివేక్ చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిపోయిందని, గతంలో బిఆర్ఎస్ పార్టీ తెచ్చిన నిధులతోనే ప్రస్తుతం మంత్రి వివేక్ పనులు చేస్తున్నారే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి నియోజకవర్గానికి కొత్త నిధులు ఏమీ తీసుకురాలేదని, నియోజకవర్గంలోని రైతాంగ సమస్యలు, నిరుద్యోగ సమస్యలు, సింగరేణి కార్మికుల సమస్యలను మంత్రి వివేక్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చెన్నూర్ ఎత్తిపోతల పథకాన్ని ఆపి వేయడం తోపాటు గతంలో బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో 500 కోట్ల రూపాయల నిధులతో నియోజకవర్గంలో ఏర్పాటు చేయదలచిన పామాయిల్ ఫ్యాక్టరీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిరక్ష్యం కారణంగా నియోజకవర్గం నుంచి ఫ్యాక్టరీ తరలి వెళ్ళిపోయిందన్నారు. ప్రస్తుతం చెన్నూరు నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంతో కాంగ్రెస్ పార్టీకి రాజీనామాలు చేసి బిఆర్ఎస్ పార్టీలోకి వస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాలకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు ఊపు తెచ్చే జగిత్యాల బహిరంగ సభ

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:

సోమవారం సాయంత్రం 5 గంటలకు జగిత్యాలలోని వివేకానంద స్టేడియంలో నిర్వహించబడనున్న భారీ సభ ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇటీవల జీవన్ రెడ్డి భారత్ రాష్ట్ర సమితిలో చేరిక నేపథ్యంలో ఈ సభ ఏర్పాటు చేయబడుతోంది. ఈ సభను విజయవంతం చేయాలని రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, ప్రధాన కార్యదర్శి జంకె శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలిరావాలని వారు కోరారు. ఇటీవల



జరిగిన సమావేశాల్లో నాయకులు మాట్లాడుతూ, ఈ చేరికతో ఉత్తర తెలంగాణలో పార్టీకి మరింత బలం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చెల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదేశాల మేరకు పలు గ్రామాల నుంచి వందలాది మందిని సభకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రూరల్ మండల పరిధిలోని గ్రామాల వారీగా వాహన సౌకర్యం కల్పించి సమయానికి సభ స్థలానికి చేరుకోవాలని సూచించారు. ఈ సభ ద్వారా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత లభించి కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపుతుందని నాయకులు పేర్కొన్నారు.

## హిందూ సమ్మేళన కమిటీ ఏర్పాటు

**-సమాజ ఐక్యత, స్వధర్మ పరిరక్షణే లక్ష్యం**

కొడిమ్యాల, ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో హిందూ సమాజ ఐక్యతను బలోపేతం చేయడం, సామాజిక సామరస్యతను పెంపొందించడం, కుటుంబ వ్యవస్థను రక్షించడం వంటి ప్రధాన లక్ష్యాలతో హిందూ సమ్మేళన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ద్వారా ప్రతి హిందువులో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, మత మార్పిడిని నివారించడం, దేవాలయ వ్యవస్థను పటిష్టం చేయడం, స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, జాతీయ భావాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. కమిటీ అధ్యక్షుడిగా రాచకొండ చంద్రమోహన్, గౌరవ అధ్యక్షులుగా గడ్డం జీవన్ రెడ్డి, కంచర్ల సత్యనారాయణలను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా పిట్టల శ్రీనివాస్, చిట్టిపాక రమేష్, అంకం పద్మ నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కాయిత రమేశ్ బాధ్యతలు చేపట్టగా, సహ కార్యదర్శులుగా కంచర్ల రాజమోళి, జక్కుల మల్లేశం వ్యవహరించనున్నారు. కోశాధికారిగా అయిట్ల రమేష్, సహ కోశాధికారిగా సామ భాస్కర్ రెడ్డి నియమితులయ్యారు. సాంస్కృతిక ప్రముఖుడిగా బద్దెనపల్లి నారాయణను ఎన్నుకున్నారు. ఈ కమిటీ హిందూ సమాజంలో ఐక్యత, సామరస్యత, సేవా భావాన్ని పెంపొందిస్తూ, స్వధర్మ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ముఖ్యమంత్రి సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మంత్రి శ్రీధర్ బాబు

మంథని ప్రభాతవార్త ;

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండవ విడత రైతు భరోసా నిధులను విడుదల చేయటానికి మంథని నియోజకవర్గం కాటారం మండలానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయడానికి మంత్రి శ్రీధర్ బాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సోమవారం సాయంత్రం మంథని నియోజకవర్గం లోని కాటారం మండలం నస్తురుపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు మంథని నియోజక వర్గం నుండి వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు రైతులు మహిళలను ప్రత్యేక వాహనాలు తరలించడానికి పూర్తి ఏర్పాట్లు చేశారు. దీని కోసం ముందస్తుగా మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తలకు నాయకులకు దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు రైతులు మహిళా సంఘాల నాయకులు, ఉత్సాహవంతులు తప్పకుండా ముఖ్యమంత్రి సభలో పాల్గొనే విధంగా ఏర్పాటు చేశారు. అదేవిధంగా వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఇతర శాఖలకు చెందిన అధికారులకు వాహనాలు కేటాయించి జనాలను తరలించే విధంగా వారికి దిశా నిర్దేశం చేశారు. మంథని నియోజకవర్గం లో మొదటిసారిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం లో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది.

### మంథని నియోజకవర్గం లో ముఖ్యమంత్రి బిజీ షెడ్యూల్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం మంథని నియోజకవర్గం లో బిజి షెడ్యూల్లో పాల్గొంటున్నారు. సోమవారం ముఖ్యమంత్రి తొలుత కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ బ్యారేజ్ సందర్శించనున్నారు. అనంతరం శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని అక్కడే సరస్వతి నది అంత్య పుష్కరాలు, గోదావరి నది పుష్కరాల పైన అధికారులతో రివ్యూ సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. సాయంత్రం రైతు భరోసా రెండవ విడత నిధులను విడుదల చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు పలువురు ఎమ్మెల్యే లు ఎంపీ లు పాల్గొన నున్నారు.

### పోలీసుల భద్రత వలయంలో మంథని కాటారం రహదారి

మంథని నియోజక వర్గానికి తొలిసారిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో అదేవిధంగా రాష్ట్రస్థాయిలో రైతు భరోసా నిధులను విడుదల చేస్తున్న బహిరంగ సభ కార్యక్రమం కోసం తెలంగాణలోని అన్ని జిల్లాల నుండి రైతులు కాంగ్రెస్ కార్యకర్తలు తరలి రానున్న నేపథ్యంలో మంథని నుండి కాటారం వరకు ఉన్న ప్రధాన రహదారి పైన పోలీసులు గట్టి నిఘా తో పట్టు భద్రత ఏర్పాటు చేశారు. వేలాది గా వాహనాలు రానున్న నేపథ్యంలో వాటి కోసం అవసరమైన పార్కింగ్ లతో పాటు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. సోమవారం ఉదయం నుండి మంగళవారం ఉదయం వరకు మంథని కాటారం రహదారి పైన ఎలాంటి ఇసుక లారీలు, భారీ వాహనాలు నడవకుండా పోలీసులు చదివి చేపట్టారు. అదేవిధంగా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

# అటవీ గ్రామాల్లో అభివృద్ధి దీప్తి

**-ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇండక్షన్ స్టావ్‌లు, సోలార్ లైట్లు ప్రారంభం**

పెంచికల్ పేట్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:



పెంచికల్ పేట్ మండలంలోని అటవీ, గిరిజన గ్రామాల అభివృద్ధికి కొత్త దిశగా అడుగులు పడుతున్నాయి. ఆదివారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఆధ్వర్యంలో అటవీశాఖ పర్యవేక్షణలో అగర్ గూడ, గుండేపల్లి గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అగర్ గూడ, గుండేపల్లి గ్రామాల్లోని 30 కుటుంబాలకు మొదటి విడతలో ఇండక్షన్ స్టావ్ లను పంపిణీ చేశారు. అనంతరం, గుండేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్ లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హరీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రెవాల్, డివిజనల్ అధికారి అయ్యప్ప, పెంచికల్ పేట్ ఎఫ్ఆర్వో అనిల్ కుమార్, ఎంపిడిఓ మహేందర్ రెడ్డి, సర్పంచులు అల్లూరి రాజేశ్వరి, కొండ్రా సులోచన, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల యువత నుండి దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగింపు

**-జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈ.ఈ. చాతరాజుల దుర్గాప్రసాద్**

నస్పూర్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:

2025-26 సంవత్సరానికి గాను 2 పాడి గేదెల పెంపకం పథకం కోసం అర్హత గల ఎస్.సి. యువత దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని మంచిర్యాల జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యనిర్వాహక సంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్ లైన్ లో నమోదు చేసిన దరఖాస్తును డౌన్ లోడ్ చేసుకొని అవసరమైన ప్రతులను జతపరిచి సంబంధిత మండల/మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించాలని, అభ్యర్థులు దరఖాస్తుతో ఆధార్ కార్డు, రేషన్ కార్డు /ఆహార భద్రతా కార్డు, కుల ధ్రువీకరణ పత్రం (తెలంగాణ ఏర్పడిన తర్వాత జారీ చేయబడినది), ఆదాయ ధ్రువీకరణ పత్రం (మీ సేవ ద్వారా జారీ చేయబడింది, గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల లోపు ఉండాలి) తెలిపారు. పాడి పశువుల పథకం కొరకు పశుగ్రాసం పెంచేందుకు కనీసం 10 గుంటల భూమి కలిగి ఉండాలని, పాస్పోర్ట్ సైజ్ ఫోటో జతపరచవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 23వ తేదీలోగా ఆన్ లైన్ లో టిజిఓబిఎంఎంఎస్.సిజిజి.జిఓవి.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారిణి సత్తెమ్మకు కేటీఆర్ ఘన నివాళి

అంత్యక్రియలలో పాల్గొని పాడే మోసిన కేటీఆర్, చెల్మెడ

**వేములవాడ టౌన్, ప్రభాతవార్త:** వేములవాడ నియోజకవర్గం అగ్రహారానికి



చెందిన ప్రముఖ ఉద్యమకారురాలు తెలంగాణ సత్తెమ్మ మృతి పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తు. ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించడమే కాకుండా, స్వయంగా పాడె మోశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో సత్తెమ్మ చురుకైన పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో ప్రతిరోజూ పాల్గొంటూ, "జై తెలంగాణ" నినాదమే ఊపిరిగా జీవించిన ధీరవనిత ఆమె. స్వరాష్ట్ర సాధన కోసం సత్తెమ్మ చేసిన పోరాటం, ఆమె అంకితభావం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కేటీఆర్ కొనియాడారు. వేములవాడ మండలం అగ్రహారం ఆర్ అండ్ ఆర్ కాలనీ లో జరిగిన సత్తెమ్మ అంత్యక్రియలలో కేటీఆర్‌తో పాటు వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహ రావు ,మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ , నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని సత్తెమ్మకు కన్నీటి వీడ్కోలు పలికారు.

# మెట్టుపల్లిలో వైభవంగా హిందూ సమ్మేళనం

పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ సహ కార్యదర్శి కేశవరాజు







**మెట్టుపల్లి డివిజన్, ప్రభాతవార్త :** జగిత్యాల జిల్లా మెట్టుపల్లి పట్టణంలోని అభయ హస్త హనుమాన్ సమీపంలోని దుర్గామాత గ్రౌండ్ లో నేతాజీ బస్తీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హిందూ సమ్మేళనం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సమ్మేళనంలో పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మిక స్వామీజీలు మాట్లాడుతూ హిందూ సమాజ ఐక్యత అవసరాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. హిందువులంతా ఒకటిగా నిలబడి తమ సాంప్రదాయాలు, ఆచారాలు, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని అన్నారు. ప్రస్తుత కాలంలో సనాతన ధర్మ విలువలు తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి కుటుంబం తమ పిల్లలకు చిన్ననాటి నుంచే హిందూ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధాన వక్త విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ సహ కార్యదర్శి ఆకారపు కేశవరాజు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని బలహీనపరచడానికి కొన్ని విదేశీ మతమార్పిడి శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి పరిస్థితుల్లో హిందూ సమాజం అప్రమత్తంగా ఉండి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యతే శక్తి అని, పరస్పర సహకారం ద్వారా మాత్రమే ధర్మ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు, నృత్యాలు, సంగీత కార్యక్రమాలు, ధార్మిక ప్రసంగాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హనుమాన్ నగర్ గ్రౌండ్ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు, యువతులు కూడా ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమానికి శోభను చేకూర్చారు. కార్యక్రమం అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి హిందూ సమ్మేళన సమితి నిర్వాహకులు ప్రత్యేకంగా శ్రమించారు. ఈ హిందూ సమ్మేళనం మెట్టుపల్లి పట్టణంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపడంతో పాటు హిందువులలో ఐక్యత భావాన్ని మరింత బలపరిచిన కార్యక్రమంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో నేతాజీ బస్తీ గౌరవ అధ్యక్షులు బొమ్మెల శంకర్, గోపి, అధ్యక్షులు రఘుపతిరావు, ప్రధాన కార్యదర్శి లక్కం మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు పోలీస్ శ్రీనివాస్, ఏడవ వార్డ్ కౌన్సిలర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్, ఆర్ఎస్ఎస్ నాయకులు గుంటుక గంగాధర్, అల్లె మధు వేములవాడ రాజశేఖర్, గాజంగి నాగరాజు, పాంపట్టి ఆనంద్, కలర్స్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

# బడిబాట పట్టేలా..

### జూన్ 12 వరకు కార్యక్రమం

### ప్రభుత్వ ఉపాధ్యాయుల ముమ్మర ప్రచారం

### ప్రవేశాల పెంపే లక్ష్యంగా పోస్టర్లు, కరపత్రాలు

### ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నాలు



**మల్లాపూర్ ప్రభాతవార్త** వేసవి సెలవులు వచ్చాయంటే ఏ గల్లికి వెళ్లిన ప్రైవేటు పాఠశాలల సిబ్బంది కనిపిస్తారు. పిల్లలను తమ స్కూలులో చేర్చాలని తల్లిదండ్రులను కోరుతుంటారు. ఆ పరిస్థితులకు భిన్నంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తమ పాఠశాలలో చేర్పించండి అంటూ ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల పెంపే లక్ష్యంగా ప్రభుత్వం ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు బడిబాట నిర్వహించాలని ఆదేశించింది. గత ఏడాది హెచ్ఎం ప్రధానోపాధ్యాయులులు, ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటీల సహకారంతో స్వచ్ఛందంగా బడిబాట నిర్వహించి విద్యార్థుల పెంపే లక్ష్యంగా పనిచేశారు.

### విద్యార్థుల గుర్తింపు..

సాధారణంగా ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని జూన్ రెండవ తేదీ నుంచి నిర్వహిస్తుంది. ఈ ఏడాది మాత్రం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ముందస్తుగా కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రస్తుతం ఒంటిపూట బడులు కొనసాగుతున్న నేపథ్యంలో ఉదయం ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య బడిబాట చేపడుతున్నారు. బడి బయట ఉన్న పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే వారిని గుర్తిస్తున్నారు. పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు డిజిటల్ తరగతులు గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు నోట్బుక్కులు యూనిఫాం అందిస్తున్నామని చెబుతున్నారు. నాణ్యమైన విద్య అందిస్తామని ఏఐ ద్వారా బోధిస్తామని హామీ ఇస్తున్నారు. ఆంగ్లంలో బోధన, ప్రతి నెల తల్లిదండ్రుల సమావేశం.. ఇలా పలు అంశాలను ఎజెండాగా ఎంచుకొని ప్రచారం చేస్తున్నారు. సౌకర్యాలపై కరపత్రాలు చిన్నపాటి పోస్టర్లను ముద్రించారు.

### ప్రవేశాల పెంపునకు కృషి

**కేతిరి దామోదర్ రెడ్డి, ఎంఈఓ మల్లాపూర్.**



ప్రజా పాలన ప్రగతి ప్రాణానికలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయులతో కలిసి ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు డిజిటల్ తరగతులు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్ తదితర అంశాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రవేశాలు పెంచేలా ప్రయత్నం చేస్తున్నాం.

### మండలంలో విస్తృతంగా ప్రచారం చేశాం

**భూమేష్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్**



మల్లాపూర్ మండలంలో పలు. ప్రధాన రోడ్డుల వెంబట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విద్యార్థుల ఉన్నత మార్కులతో కూడిన విద్యార్థుల ఫోటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి మండలంలో ప్రచారం విస్తృతంగా నిర్వహిస్తున్నా మని ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణతో పాటు అలవాటు పడుతుందని ప్రభుత్వ పాఠశాల ముద్దు అని అన్నారు.

## ఘనంగా సూర్య అర్చనలు, అభిషేకములు

**మేళ్ళచెర్వు ఏప్రిల్19 ప్రభాతవార్త** స్థానిక శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభూ శంభులింగేశ్వరస్వామి శ్రీగోదాభూనీలసమేత శ్రీవెంకటేశ్వర స్వామి శ్రీదేవిభూదేవి సమేత శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాలలో ఆదివారం సంధర్భముగా శ్రీ సూర్యదేవునికి అర్చనలు, అభిషేకములు, ఆరాధనలు, సూర్యనమస్కారములు, గోమాతకు ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లి వార్త



## డోర్నకల్ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా ఎండి అవేజ్ నియామకం

**మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:**



మెట్ పల్లి ప్రాంతానికి చెందిన ఎండి అవేజ్ మహబూబాద్ పార్లమెంట్ పరిధిలోని డోర్నకల్ అసెంబ్లీ ఎలక్షన్ కో ఆర్డినేటర్ గా నియామక మయ్యారు. ఇట్టి నియామక పత్రాన్ని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా డోర్నకల్ అసెంబ్లీ ఎలక్షన్ కోఆర్డినేటర్ గా నియామకమైన ఎండి అవేజ్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనమీద నమ్మకంతో డోర్నకల్ అసెంబ్లీ ఎలక్షన్ కోఆర్డినేటర్ గా నియామకం చేసిన టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. డోర్నకల్ అసెంబ్లీ పరిధిలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

## జాతర మహోత్సవానికి ముస్తాబైన ఆలయం

**ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త**

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని అతి పురాతన ఆలయం అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి ముస్తాబయింది. మహోత్సవంలో భాగంగా సోమవారం స్వామి వారికి అభిషేకం, విష్వక్సే నారాధన, పుణ్యవచనము, రక్షాబంధనం, అంకురారోపణం, సాపిత మండపారాధన, ధ్వజారోహణం, గరుడ కళ్యాణం, తీర్థప్రసాదా వితరణ కార్యక్రమాలు నిర్వహించనట్లు ఆలయ అర్చకుడు వెంకటేశ్వర చార్యులు తెలిపారు. అలాగే మంగళవారం స్టాపిత మండపారాధన, పంచసూక్త హోమము, భేరితాడన పూజ విధి, బలిహరణము, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, బుధవారం స్థాపిత మండపారాధన, స్థాపిత హోమము, స్వామి వారి ఎదురుకోలు, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం, అన్నదానం, మహాపూర్ణాహుతి, ఆశీర్వచనం, సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథయాత్ర, బలిహరణం ఉంజల్ సేవ , ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామి వారి కళ్యాణం అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆ భగవంతుని ఆశీస్సులు పొందాలని గ్రామ అభివృద్ధ కమిటీ అధ్యక్షుడు రాజేశుని భూమయ్య, ఉపాధ్యక్షుడు వెలిశాల శేఖర్, ప్రధాన కార్యదర్శి నేరేళ్ళ శ్రీనివాస్, రాజేశుని రాజారెడ్డి, సల్ల సునీల్ తదితరులు కోరారు.

## బిఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ

### కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్.

**మెట్‌పల్లి,ప్రభాతవార్త:** జిల్లాలో బిఆర్ఎస్ పార్టీకి ఆదరణ పెరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి పట్ల ప్రజలు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజకీయ వాతావరణం మరింత ఉత్సాహ భరితంగా మారగా.. ఎమ్మెల్యే డా. సంజయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మపూర్, తండ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరగా..వారికి ఎమ్మెల్యే సంజయ్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో భూక్య రమేష్ నాయక్, భూక్యా సునీల్ నాయక్, భూక్యా సంజీవ్ నాయక్, గుగ్లవత్ రమేష్ నాయక్, జరుపుల రవి నాయక్, కట్ట హన్మండ్లు గౌడ్,గోపిడి రాజేందర్,జిత్తం రమేష్, చిట్యాల జగన్ తదితరులు చేరారు. బిఆర్ఎస్ లో చేరికలతో కోరుట్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలపడుతుందని ఎమ్మెల్యే ఆశాభ్వావ వ్యక్తంచేశారు.



## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త..

తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో శ్రీ వెంకటేశ్వర కంటి హాస్పిటల్,ఆపిల్ డెంటల్ హాస్పిటల్ ల వారి సౌజన్యంతో ఉచిత కంటి,పంటి వైద్య శిబిరాన్ని మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య,వి5 గిబి టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ ఉచిత వైద్య శిబిరానికి సర్పంచ్ మోర లక్ష్మీ మ్రాజం,ఉపసర్పంచ్ ఆసాని శ్రీకాంత్ రెడ్డి లు ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ మేరకువైద్య శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు,కంటి సమస్యల పై వైద్య సలహాలు,ఉచిత డెంటల్ చెక్ అప్ లు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ గ్రామస్తులు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని అన్నారు.అనంతరం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన మాజీ జడ్పిటిసి కోడి అంతయ్య,వి5 గిబి టెక్నాలజీ సంస్థ



నిర్వాహకులు రవి లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోర లక్ష్మీ మ్రాజం,ఉప సర్పంచ్ ఆసాని శ్రీకాంత్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య,బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజన్న, మాజీ సర్పంచ్ అంకారపు రవీందర్,వైద్యులు భానుచందర్,శ్యాంసుందర్ రెడ్డి,బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండి జగన్,వార్డ్ మెంబర్ తాటికొండ చందు,బిఆర్ఎస్ యూత్ నాయకులు నవీన్ రెడ్డి,వైద్య సిబ్బంది,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల వార్త

## ఇళ్ల గణనపై శిక్షణ



గంభీరావుపేట, ప్రభాతవార్త:

జనాభా గణన రెండో విడతలో భాగంగా ఆదివారం గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారము శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి ఆదేశాల మనకు 2027 లో భాగంగా 19 నుండి 21 మరియు 24 నుండి 26 వరకు రెండు విడతలలో ఇండ్ల గణన కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేటర్స్ , సూపర్వైజర్ కు మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని తహసిల్దార్ మారుతి రెడ్డి ప్రారంభించారు. ఇండ్ల గణనపై తీసుకోవాల్సిన పలు అంశాలను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ట్రైనర్ ఆడెపు వేణు, ఆర్ ఐ ప్రశాంత్, ఏఎస్ఓ వంశీ లతోపాటు తదితరులు పాల్గొన్నారు. పలువురి సందేహాలకు సూచనలు సలహాలు అందజేశారు

## తెలంగాణ జాగృతిలో మహిళల చేరికలు

గంభీరావుపేట, ప్రభాతవార్త:

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో గంభీరావుపేట మండలానికి చెందిన పలువురు మహిళలు ఆదివారం జాగృతి పార్టీలో చేరారు. మండల జాగృతి నాయకులు కూర సురేష్ పటేల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రాష్ట్ర జాగృతి పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షురాలు ఆధ్వర్యంలో మహిళలు పార్టీలో చేరారు. మాజీ రైతు సంగం అధ్యక్షులు పల్లె బాలయ్య, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు యామన్న గారి పాపారావు, వెంకయ్య గారి శివమాల, కొట్టే లక్ష్మి మ్మ, వెంకయ్య గారి వాణి, శివరాత్రి స్వరూప, వెంకయ్య గారి పల్లవి, కాల్వ రేఖ, సుశీల, అంజవ్వ, అనిత, లక్ష్మి మ్మ, రేఖ, ఉషవ్వ లతోపాటు పలువురు పార్టీలో



చేరగా పార్టీ అధ్యక్షురాలు వారికి కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. ప్రశ్నించు పోరాడు పరిష్కరించు అనే నినాదంతో జాగృతి పార్టీలో చేరి ముందుకు వెళుతున్నట్లు మండల జాగృతి నాయకులు కూర సురేష్ సందర్భంగా తెలిపారు. వారి వెంట జిల్లా జాగృతి ఉపాధ్యక్షులు వర్ధ సతీష్ కుమార్, జాగృతి నాయకులు ఎర్ర నర్సయ్య, రంగారావు లు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే

ముస్తాబాద్ ప్రభాత వార్త:



మండలములో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అరైవ్ ఆలైవ్(బ్రతికే చేరుకో క్షేమంగా చేరుకో)అనే కార్యక్రమములో బాగంగా మండల ఎస్సై గణేష్ తగు చర్యలు తీసుకుంటున్నారు.మండల వ్యాప్తంగా ఆయాగ్రామాల్లో డేంజర్ జోన్ గా పిలవబడే మూల మలుపుల వద్ద ఇప్పటికే రెడ్ స్టిక్కర్ లు అతికించారు.ఇక నుంచి మద్యం సేవించి వాహనాలు నడిపితే వ్యక్తిపై కేసునమోదు చేసి జైలుకు తరలిస్తామని అన్నారు. శనివారం జిల్లాలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 18 మందికి 5 వేల జరిమానాతో పాటు జైలుకుతరలించడంజరిగిందన్నారు. నేటినుంచి ప్రతి గ్రామములో, గ్రామశివార్లలో,బయట ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తామని అన్నారు

## మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్షలు రాసిన విద్యార్థులు

ముస్తాబాద్ ప్రభాత వార్త:

నామపూర్ మోడల్ స్కూల్లో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలకు మొత్తం 139 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 125 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా,మిగతా 14 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ కొండల్ రెడ్డి తెలిపారు.

## హిందూ ధర్మ రక్షణకు నడుం బిగిద్దాం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

హిందూ ధర్మ రక్షణకు ప్రతి హిందువు నడుం బిగించాలని శ్రీశ్రీశ్రీ విష్ణుసేవా నందగిరి స్వామీజీ పిలుపునిచ్చారు.మండలములోని గాలిపెల్లి హరిహర దేవాలయంలో ఆదివారం నాడు జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు.ప్రధాన వక్తగా పాల్గొన్న ఆర్ ఎస్ ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ మాట్లాడుతూ హిందువుగా ప్రతి మనిషి జీవించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సహ శారీరక్ ప్రముక్ ఎలిగేటి వంశీ,జిల్లా పర్యావరణ ప్రముక్ బత్తిని ఆంజనేయులు,నిర్వహణ సమితి అధ్యక్షులు మల్లు గారి దేవేందర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి కోమటి రెడ్డి శ్రీనివాస్, కోశాధికారి అయ్యన్న గారి హరికృష్ణ రెడ్డి,గాలిపల్లి సర్పంచ్ లు బద్ధం శేఖర్ రెడ్డి,బెంద్రం శంకరమ్మ,సింగిరెడ్డి రచన,నిర్వహణ సమితి సభ్యులు చిలుముల బాలనాగచారి,రమణారెడ్డి,సమితి సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు గౌరవం ఇచ్చే పార్టీ కాంగ్రెస్ పార్టీ

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



మహిళలను గౌరవించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రపతి గవర్నర్ హోదాతో పాటు ముఖ్యమైన హోదాలలో, ముఖ్యమంత్రిగా మహిళలు అవకాశం కల్పించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం కోసమే మహిళా బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఉందని ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం మహిళా బిల్లుకు వ్యతిరేకం కాదని డిలిమిటేషన్ బిల్లుకు మాత్రమే వ్యతిరేకమని తెలిపారు.2023 లోక్ సభ రాజ్యసభలో ప్రవేశపెట్టిన మహిళా బిల్లును అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తే, బిజెపి ప్రభుత్వం మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమని ప్రచారం నిర్వహిస్తుందన్నారు. మహిళలకు గౌరవించే పార్టీ ప్రాధాన్యత కల్పించే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని అన్నారు. ఈ సమావేశంలో సూరదేవరాజ్, కౌన్సిలర్లు ఆడపు చంద్రకళ, వెంగళ లీల, శ్రీశైలం, తిరుపతి, శ్రీనివాస్, నాయకులు ఆకునూరి బాలరాజ్, మల్లేశం, చందు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సిరిసిల్లలో పిడుగుల బీభత్సం ఆకాశం నుంచి రాలిన నిప్పులు

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త

:రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వాతావరణం ఒక్కసారిగా భయానకంగా మారిపోయింది. అనూహ్యంగా ముంచుకొచ్చిన ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం పట్టణ వాసులను ఉలిక్కిపడేలా చేసింది. వర్షంతో పాటే ఆకాశం నుంచి విరుచుకుపడిన పిడుగుల ధాటికి స్థానిక రాజీవ్ నగర్ శివారులో ఓ తాడిచెట్టు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది.ఆకాశం నుంచి అక్షరాలా నిప్పులు కురిసినట్లుగా భారీ శబ్దంతో తాడిచెట్టుపై పిడుగు పడటంతో క్షణాల్లోనే ఆ ప్రాంతమంతా భయానక వాతావరణం నెలకొంది. స్థానికులు చూస్తుండగానే దట్టమైన పొగలతో చెట్టు భగభగ మండుతూ కాలిపోయింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు ఈ ఆకస్మిక వర్షం వాతావరణాన్ని చల్లబరిచినప్పటికీ.. వరుసగా పడుతున్న పిడుగులు తీవ్ర కలకలం రేపుతున్నాయి

## మహిళా బిల్లు అమలుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ మహిళా బిల్లు తోపాటు డీ లిమిటేషన్ బిల్లుకు మాత్రమే వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. మహిళలకు బిల్లును మాత్రమే ప్రవేశపెడితే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అన్ని పార్టీలను కలుపుకొని బిల్లుకు ఆమోదం తెలుపుతారని అన్నారు. దక్షి ణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే విధంగా, ఉత్తరాది రాష్ట్రాలకు న్యాయం జరిగే విధంగా బిజెపి పార్టీ పనిచేస్తుందని అన్నారు. మహిళల బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం అనే విధంగా ప్రజల్లో బిజెపి పార్టీ అపోహ తీసుక వస్తుందన్నారు. ఈ సమావేశంలో ఆకునూరి బాలరాజు, కౌన్సిలర్ తిరుపతి, శ్రీనివాస్, మల్లేశం, లక్ష్మీ మ్నారాయణ , నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోల్లు తక్షణమే చేపట్టాలి

ముస్తాబాద్ ప్రభాత వార్త



:ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని మాజీ రైతు బంధు మండల అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ మాసం ముగిసి,మే మాసం ప్రారంభం అవుతున్న ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదనిఆవేదన వ్యక్తం చేశారు.వేసవిలో రైతులు పడుతున్న ఇబ్బందులు, ఎండలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు,ఓఆర్ ఎస్ ప్యాకెట్లను అందించాలని అన్నారు.

## వ్యాసరచన పోటీల్లో శుభోదయ విద్యార్థికి ప్రథమ బహుమతి



తంగళ్లపల్లి,ప్రభాతవార్త

..రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్,రవాణా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన,క్విజ్,డ్రాయింగ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించారు.ఈ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా తంగళ్ళపల్లి కి చెందిన శుభోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి ఆరాధ్య వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి సాధించింది.ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ లక్ష్మణ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ చేతుల మీదుగా ప్రథమ బహుమతి,ధ్రువ పత్రం అందజేస్తూ ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మమత తదితరులు పాల్గొన్నారు..

# కల్వకుంట్ల కుటుంబంతోనే రాజకీయాలు కలుషితం

- బిఆర్ఎస్ నాయకులే గుంట నక్కలు
- ప్రజా సమస్యలపై సింహాల ముందుకు సాగుతున్న సిఎం
- సీఎం రేవంత్ రెడ్డిని ఏకవచనంతో మాట్లాడడం సరికాదు
- నేరేళ్లకు వస్తా కేటీఆర్ జాగ్రత్త దళితులపై జరిగిన దాడికి సమాధానం చెప్పాలి
- ధర్మపురికి రా.. అభివృద్ధి ఏమిటో చూపిస్తా
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



కల్వకుంట్ల కుటుంబంతోనే రాష్ట్రంలో రాజకీయాలు కలుషితమయ్యాయని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారుజగిత్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూబీఆర్ఎస్ పార్టీ జగిత్యాలలో నిర్వహిస్తున్న సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు జగిత్యాల వచ్చిన మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తూ రాజ్యాంగంపై బ్రహ్మానందం చేసి సీఎం రేవంత్ రెడ్డిని ఏకవచనాలతో మాట్లాడడం కేటీఆర్ విజ్ఞతకే వదిలేస్తున్నామని పేర్కొన్నారు పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ అడ్డగోలుగా, అక్రమంగా, అవినీతి ద్వారా డబ్బులు సంపాదించి జగిత్యాల జైత్రయాత్ర పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని అన్నారు. 2018లో కొండగట్టు ఘాట్ రోడ్ లో జరిగిన ప్రమాదంలో 60 మంది మరణిస్తే ముఖ్యమంత్రి హోదాలో ఉన్న కేసీఆర్ బాధితులను పరామర్శించలేదని మంత్రి అడ్లూరి విమర్శించారు. రెండు సంవత్సరాల నాలుగు నెలల క్రితం ఏర్పడిన ప్రజా ప్రభుత్వంపై బావ, బావ మరుదులు గుంట నక్కల్ల తయారై విషం కక్కుతున్నారని మంత్రి అన్నారు. ప్రజాస్వామ్య బద్దంగా, రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఏకవచనంతో సంభోదిస్తున్నారని మరో మారు రేవంత్ రెడ్డి గారిని ఇలా సంబోధిస్తే ఊరుకునేది లేదని మంత్రి హెచ్చరించారు.ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క ఇలాగే ప్రవర్తించారా అని మంత్రి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేసి కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని కేటీఆర్, హరీష్ రావులు ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అన్నారు. 2023 ఎన్నికల్లో ఓటమి తర్వాత కేటీఆర్, హరీష్ రావులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు వీరిని విశ్వసించడం లేదని మంత్రి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో, పంచాయతీ ఎన్నికల్లో, ఉప ఎన్నికల్లో ఓటమి చెందారని వరుస ఓటములు తట్టుకోలేక ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అన్నారు.ప్రజల సమస్యలను పరిష్కరించుకుంటూ రేవంత్ రెడ్డి సింహంలా ముందుకు సాగుతున్నారని అన్నారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ బిల్లుపై దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని గొంతెత్తిన నాయకులు రేవంత్ రెడ్డి అని మంత్రి అన్నారు. తాను ధర్మపురి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపణ చేస్తున్నారని అభివృద్ధి అంటే ఏమిటి చూపిస్తా ధర్మపురి రావాలని కేటీఆర్ కు మంత్రి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సాంఘీక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ ఏనాడు ఆసంక్షేమం గురించి పట్టించుకోలేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సంక్షేమ వసతి గృహాలకు ఒకదానికి కొప్పుల పక్కా భవనం నిర్మించలేదని మంత్రి ఆరోపించారు. మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి గౌరవం ఇచ్చి మాట్లాడాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ సూచించారు. తాను త్వరలోనే సిరిసిల్లకు వస్తానని నేరెళ్ల దళితులపై జరిగిన దాడి పై ప్రశ్నిస్తానని దీనికి అప్పుడు అధికారంలో ఉన్న కేటీఆర్ సమాధానం చెప్పాలని మంత్రి అన్నారు. జగిత్యాలలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే సభలో 10 ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఏం చేశారనే వివరణ ఇవ్వాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస మాట్లాడుతూ టిఆర్ఎస్ 10 సంవత్సరాల కాలంలో అవినీతి రాష్ట్రంలో అరాచక పాలన చేసేందని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలలో అనేక సంక్షేమ పథకాలు ప్రారంభించి ఉద్యోగులకు మహిళలకు నిరుద్యోగులకు రైతులకు అన్ని రంగాలలో సమస్యలు పరిష్కరించి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం పరిపాలల్లో ముందుందని పేర్కొన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి తో పనిచేస్తున్నానని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ నన్ను విమర్శించడం సరికాదని మా కుటుంబం ఎంతో కష్టపడి పైకి వచ్చామని కొందరు అక్రమంగా డబ్బు సంపాదించి విమర్శలు చేయడం చూస్తూ ఊరుకోమన్నారు. మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత తండ్రి పై కేసులు ఉంటే ప్రత్యేకంగా మాఫీ చేయించానని నేడు కొందరితో కలిసి నన్ను విమర్శించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డిసిసి అధ్యక్షులు నందయ్య కాంగ్రెస్ నాయకులు బండ శంకర్ కొత్త మోహన్ గిరి నాగభూషణం దామోదర్ రావు మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి సమీండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకాశంలో మబ్బులు.. ఆందోళనలో రైతులు!!

## ఈదురు గాలులు మెరుపులతో రైతన్నల ఆందోళన

గంభీరావుపేట, ప్రభాతవార్త:





ప్రకృతి రైతన్నలను విడిచిపెట్టినట్లుగా లేదు. ఆరుగాలం కష్టించి పండించిన దాన్యం చేతికి వచ్చే సమయంలో ఆకాశంలో మబ్బులు చూసి రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం సాయంత్రం గంభీరావుపేట మండలంలోని పలు గ్రామాలలో ఈదురు గాలులు మెరుపులను చూసి రైతన్నలు దిగాలు చెందుతున్నారు. మండల వ్యాప్తంగా రబీ సీజన్లో మొదట వేసిన వరి పంట కోతకు వచ్చి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్న సమయంలో ఈదురు గాలులు మెరుపులతో కూడిన ఉరుములు ఉరమడం ప్రాంత రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎక్కడ చెడగొట్టు రాళ్ల వానలు కురుస్తాయోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించిన ధాన్యము నిలువ చేయడానికి సరైన మార్కెట్ యార్డులు లేకపోవడం, కొనుగోలు కేంద్రాలకు తరలించిన దాన్యం కుప్పలకు అప్పటి పూర్తి కవర్లు కప్పి, కొనుగోలు జరిగే వరకు ప్రతి ఏటా రాత్రింబవళ్లు రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. వారం రోజుల కిందడి నుండే మండల పరిధిలోని పలు గ్రామాలలో కోతలు పూర్తయి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్న తరుణంలో ప్రభుత్వపరంగా ఏర్పాటు చేయాల్సిన కొనుగోలు కేంద్రాలు నేటి వరకు ప్రారంభోత్సవం జరగలేదు. అకాల వర్షాలు కురిసిన పక్షంలో తీవ్ర నష్టం జరిగే అవకాశాలు ఉండగా కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని ప్రాంత రైతులు అధికారులను కోరుతున్నారు.

## జగిత్యాల వార్త



# నేటి బీ.ఆర్.ఎస్ సభకు భారీగా జన సమీకరణ

**-జీవన్ రెడ్డి, కెసిఆర్ అభిమానులు అహర్నిశల కృషి**

**-వందలాది వాహనాలతో జగిత్యాలకు భారీ కాన్వాయ్**

బీర్ పూర్ ప్రభాత వార్త:

జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో ఈరోజు జరగబోయే బీ ఆర్ఎస్ సభకు భారీ జన సమీకరణతో నాయకులు సిద్ధం అయ్యారు.రాజకీయ యవనికపై ఈరోజు సరికొత్త అధ్యాయం లిఖించబడబోతోంది. మాజీ మంత్రి జీవన్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్న శుభతరుణంలో, జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు బీర్ పూర్ మండలం నుండి జనసందోహం పోటెత్తనుంది. "బీర్పూర్ గడ్డ.. జీవన్ రెడ్డి, కేసీఆర్ అభిమానుల అడ్డా" అని నినదిస్తూ వేలాది మంది శ్రేణులు సాయంత్రం జరగబోయే సభకు తరలి వెళ్లేందుకు సిద్ధమైనట్టు నాయకులు తెలుపుతున్నారు.ఈరొజు జరగబోయే సభకోసం నాయకుల అలుపెరగని కసరత్తు చేసినట్టు ఈ సభను జీవన్ రెడ్డి చేరికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీర్ పూర్ మండల నాయకులు గత కొన్ని రోజులుగా నిద్రలేని రోజులు గడుపుతు అహర్నిశలు కృషి చేశారు. ప్రతిరోజు గ్రామ గ్రామాన పర్యటిస్తూ, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతూ జన సమీకరణలో నిమగ్నమయ్యారు. నాయకుల వ్యూహాత్మక ప్రణాళికలు, క్షేత్రస్థాయిలో వారు చేస్తున్న కృషి ఫలితంగా ప్రతి పల్లె నుండి భారీగా యువత, మహిళలు, పార్టీ అభిమానులు ఈరోజు జగిత్యాలలో జరగబోయే కేసీఆర్ సభకు తరలివచ్చేందుకు సిద్ధమయ్యారని తెలుపుతున్నారు.కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారికి కావలసిన అన్ని రకాల వసతులను, వాహనలను నాయకులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ రోజు ఉదయం బీర్పూర్ మండల కేంద్రం నుండి కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాలతో కిలోమీటర్ల మేర భారీ కాన్వాయ్ జగిత్యాల వైపు కదలనుంది. బీర్పూర్ మండల రహదారులని ఈరోజు గులాబీమయం కానున్నయని కార్యకర్తలు, నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాయకుల జయజయధ్వానాలు, గులాబీ జెండాల రెపరెపలతో రహదారులన్నీ గులాబీ వనంలా మారబోతున్నాయి. ఈ భారీ ర్యాలీ మండల చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.బీర్ పూర్ మండలం ఎప్పుడూ జీవన్ రెడ్డి వెంటే ఉంటుందని, ఈ రోజు సభ ద్వారా మా మండల సత్తా ఏంటో జిల్లాకు చూపిస్తాం" అని స్థానిక నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.నాయకుల పట్టుదల, కార్యకర్తల ఆవేశం చూస్తుంటే జగిత్యాల సభకు బీర్ పూర్ నుండి తరలి వెళ్లే జన సంద్రం సరికొత్త రాజకీయ ప్రకంపనలు సృష్టించి బీర్ పూర్ సత్తా చాటేలా ఉంటుందని నాయకులు అభిమానులు సంతోషం తో దీమా వ్యక్తం చేస్తున్నారు.

# బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం

ప్రమాద స్థలాన్ని సందర్శించిన మంత్రి అడ్లూరి

పెగడపల్లి, ప్రభాతవార్త:



హార్వెస్టర్ బావిలో పడి జరిగిన ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెగడపల్లి మండలం నందగిరి గ్రామంలో హార్వెస్టర్ బావిలో పడ్డ ప్రమాద స్థలాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.మరణించిన హార్వెస్టర్ డ్రైవర్ మధు మృతదేహాన్ని బయటకు తీసే చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తరఫున అన్ని విధాల ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రమాదానికి కారణమైన బావిని మంత్రి పరిశీలించారు.మృతదేహాన్ని వేలికితీయడానికి తగిన చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ను ఫోన్ లో మంత్రి ఆదేశించారు. మృతదేహం వెలికి తీసిన తర్వాత పోస్టుమార్టం అయ్యేవరకు అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. అంత్యక్రియలు పూర్తి అయ్యే వరకు కాంగ్రెస్ మండల బాధిత కుటుంబానికి అండగా నిలవాలి మంత్రి సూచించారు.

# డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో మల్లన్న పవిత్రత కు నష్టం

## -- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:**

హుజురాబాద్ మండలంలోని సిర్సపల్లి గుట్ట సమీపంలో మల్లన్న దేవాలయం ఉందని, అక్కడ డంపింగ్ యార్డ్ పెట్టడం వల్ల మల్లన్న పవిత్రత కు నష్టం వాటిల్లుతుందని, మల్లన్న దేవుని పవిత్రతను కాపాడాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హుజురాబాద్ మండలం సిర్సపల్లి గ్రామ శివారులో ఐలోని బోటి గుట్ట వద్ద వెలసిన స్వయంభు ఐలోని మల్లన్న దేవాలయం వద్ద జరిగిన జాతరకు ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగించే, పర్యావరణాన్ని దెబ్బతీసే డంపింగ్ యార్డ్ ఏర్పాటును ఒప్పుకోనని, 9 మండలాల ప్రజలను ఏకం చేసి పోరాటం చేస్తానని, ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు పని చేయాలని, ప్రజారోగ్యానికి నష్టం కలిగించే పనులు ఏ ప్రభుత్వం కూడా చేపట్టరాదన్నారు. గత 28 రోజులుగా హుజురాబాద్ ప్రజలు మాకు డంపింగ్ యార్డ్ వద్దు మొర్రో అని నిరసనలు తెలుపుతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతంలో పచ్చని పంట పొలాలుగా ఉన్న భూములన్నీ బీడు వారుతాయని, ప్రజలు రోగాల బారిన పడతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్, వరంగల్ కార్పొరేషన్ ల చెత్తతో పాటు తొమ్మిది మున్సిపాలిటీల చెత్తను హుజురాబాద్ కు పంపించి హుజురాబాద్ లో చెత్త నరక కూపంగా తయారు చేయడానికి ప్రభుత్వం ఎందుకు ముందుకు వస్తుందని అన్నారు. సిఎస్ రామకృష్ణ రావుకు, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, కలెక్టర్ కు, ఇతర అధికారులకు విన్నవించానని ఆయన అన్నారు. ప్రజల బాగోగులు పట్టించుకోవాల్సిన ప్రభుత్వం కాంట్రాక్టర్లకు లాభం కలిగించే పనులు ఎందుకు చేస్తున్నారని అన్నారు. 9 మండలాల ప్రజలను ఏకం చేసి పోరాటం చేస్తానని అన్నారు. ప్రభుత్వం దిగి రాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తానని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం డంపింగ్ యార్డ్ విషయంలో నిర్ణయాన్ని పునరాలోచించాలని, వెంటనే డంపింగ్ యార్డ్ ను రద్దు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ రామారావు, కట్కూరు మల్లారెడ్డి, ఎడవల్లి కొండల్ రెడ్డి, ఎడ్ల విజయ్ కుమార్, జనగాం రాజేశ్వర రావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల ప్రాణాలు పోతాయని తెలిసిన డంపింగ్ యార్డ్ ను రద్దు చేయరా..??

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:**

హుజురాబాద్ పరిధిలో ఏర్పాటు తలపెట్టిన డంపింగ్ యార్డ్ తో ప్రజల ప్రాణాలు పోతాయని తెలిసిన దానిని రద్దు చేయరా అని బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద డంపింగ్ యార్డ్ రద్దు కోసం 28వ రోజు సోషల్ వారియర్లు నిరసన దీక్ష చేపట్టారు. వారికి సంఘీభావంగా సామాజిక వేత్త, సాఫ్ట్ వేర్ కంపెనీ వైస్ చైర్మన్ సబ్బని వెంకట్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఆర్టీసీ ఉద్యోగులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం పునః పరిశీలించాలని, తమ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల ప్రజల ఆరోగ్యాలు పాడవుతాయని, పర్యావరణం దెబ్బతింటుందని నిరసన తెలుపుతున్న ప్రజల అభిప్రాయాన్ని సిఎం రేవంత్ రెడ్డి గుర్తించాలని, పునరాలోచించాలని సామాజికవేత్త సబ్బని వెంకట్ అన్నారు. ప్రజల కోసం ఏ ఉద్యమానికైనా సిద్ధమన్నారు. తన వంతు బాధ్యతగా డంపింగ్ యార్డ్ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆయన వివరించారు. అనంతరం ఆర్టీసీ కార్మిక సంఘ నాయకులు తమ సంఘీభావం తెలిపారు.

**-- సోషల్ వారియర్లు, ప్రజా సంఘాల నాయకుల అర్థనగ్న నిరసన...**

డంపింగ్ యార్డ్ ను రద్దు చేయాలని కోరుతూ ఆదివారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పలువురు సోషల్ వారియర్లు, ప్రజా సంఘాల నాయకులు, యువకులు ప్లకార్డులు చేతపట్టి డంపింగ్ యార్డ్ ఏర్పాటును నిరసిస్తూ అర్థనగ్నంగా రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు వద్దు అని చెప్తున్నప్పటికి ప్రభుత్వం ఎందుకు హుజురాబాద్ లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని చూస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయని, పంటలు నష్టపోతాయని, నీరు కాలుష్యం అవుతుందని, పశువులు చనిపోతాయని చెబుతున్నప్పటికి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వారియర్స్ కోయల్కార్ శ్యామ్, పిట్టల శ్రీనివాస్, తాటిపాముల రాము, అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల నాయకులు కొలిపాక సమ్మయ్య, వేల్పుల ప్రభాకర్, సోషల్ వారియర్లు కోయల్కార్ శ్యామ్, పిట్టల శ్రీనివాస్, తాటిపాముల రాము, కాసనగొట్టు కిరణ్, అనిల్, శివాజీ, తులసి లక్ష్మణమూర్తి, సందెల వెంకన్న, చందుపట్ల జనార్ధన్, గుడిపాటి జయపాల్ రెడ్డి, అజ్జు, రియాజ్, పిల్లి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.





# కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

## -- సిఐటియు

**హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:**

గ్రామపంచాయతీ కార్మికులకు గత రెండు నెలలుగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో రెండు నెలలుగా జీతాలు రాక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వారికి పెండింగ్ జీతాలను చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. ఆదివారం హుజురాబాద్ లో ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ కార్మికులను మోసం చేస్తున్నాయని అన్నారు. పత్రికలు, వివిధ ఛానల్ ద్వారా ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా దేశవ్యాప్తంగా అన్ స్కిల్డ్ వర్కర్ కు దినసరి వేతనం 783, సెమీ స్కిల్డ్ వర్కర్ కి 868 రూపాయలు, స్కిల్డ్ వర్కర్ కి 954 రూపాయలు, అలాగే హైస్పీడ్ వర్కర్ కి 1035 అమలు చేయాలని అన్నారు. కేంద్రం తీసుకొచ్చిన కార్మిక 4 లేబర్ కోడ్ ల చట్టం ద్వారా అమలవుతాయని అన్నారు. ప్రభుత్వం నెలనెలా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడవలేని దీనస్థితిలో పంచాయతీ కార్మికులు ఉన్నారని అన్నారు. ప్రజా పాలన పేరుతో రాష్ట్రం పరిపాలన సక్రమం జరగడం లేదని, మోడీ పరిపాలన కూడా కార్మిక వ్యతిరేక విధానాలే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చొప్పదండి బిక్షపతి, మరలమరి రవి, ఆకునూరి సుధాకర్ పాల్గొన్నారు.




# న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

## కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**కరీంనగర్ లీగల్,ప్రభాతవార్త:**

న్యాయవాదులకు ఎలాంటి అవసరం ఉన్నా తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్ బార్ అసోసియేషన్



అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్,ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్ ల ఆధ్వర్యంలో అసోసియేషన్ నూతన కార్యవర్గం బండి సంజయ్ ని,ఆదివారం కరీంనగర్ మహాశక్తి ఆలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులకు ఆలయ అర్చకులు సత్కారం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సమస్యలను బండి సంజయ్ దృష్టికి తీసుకొని వెళ్ళగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి, ఏజిపి చామనపల్లి రమేష్ లతోపాటు అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు,సీనియర్ న్యాయవాదులు బాస సత్యనారాయణ, కృష్ణారావ్, తదితరులు పాల్గొన్నారు.

# జనరల్ స్టోర్ ప్రారంబించిన సర్పంచ్...

**తిమ్మాపూర్, ప్రభాత వార్త :**

తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీమహాశక్తి జనరల్స్టోర్, ఎలక్ట్రికల్ హార్డ్వేర్ షాప్ను సర్పంచ్ పొన్నం సునీతఅనిల్గౌడ్ ఆదివారం ప్రారంభించారు. స్థానికులకు సరసమైన ధరలకు



నాణ్యమైన వస్తువులు విక్రయించాలని సూచించారు. వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బూడిద కిశోర్, వార్డు సభ్యులు, దారిపల్లి రమేష్, బొజ్జ శ్రీనివాస్, దుర్గం జంపయ్య , అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఐలోని మల్లన్న చెంత హుజురాబాద్ ఎమ్మెల్యే పూజలు

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:**

హుజురాబాద్ మండలం సిర్సపల్లి గ్రామ శివారులో ఐలోని బోటి గుట్ట వద్ద వెలసిన శ్రీ స్వయంభు ఐలోని మల్లన్న జాతర సందర్భంగా మల్లన్న దేవాలయంలో ఆదివారం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా జరిగిన ఊరేగింపులో ఆయన ఒగ్గు కళాకారులు, మహిళా కోలాటాల ఊరేగింపుతున్న కాలినడకన దేవాలయంకు వెళ్లారు. ఒగ్గు డోలు వాయించి మల్లన్న దేవునికి సంప్రదాయం ప్రకారం మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబాన్ని, తమ నియోజకవర్గాన్ని చల్లగా చూడాలని ఆయన వేడుకున్నారు. ఈ



కార్యక్రమంలో బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, సామాజికవేత్త, సాఫ్ట్ వేర్ కంపెనీ వైస్ చైర్మన్ సబ్బని వెంకట్, జయన్న ఫౌండేషన్ అధినేత గుడిపాటి జయపాల్ రెడ్డి, జేఏసి నాయకులు ఈశ్వర్ రెడ్డి, రత్నం లతో పాటు పలువురు ప్రముఖులు జాతరకు హాజరై మొక్కులను సమర్పించారు.

# అభివృద్ధికి నిలువుటద్దం మాజీ ఎమ్మెల్యే గిట్ల ముకుంద రెడ్డి

**-ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు**

**-కూనారం ఎక్స్ రోడ్ వద్ద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు**

పెద్దపల్లి, ప్రభాతవార్త:

అభివృద్ధికి నిలువుటద్దం మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ గిట్ల ముకుంద రెడ్డి అని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కూనారం ఎక్స్ రోడ్ వద్ద స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే గిట్ల ముకుంద రెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే గిట్ల ముకుంద రెడ్డి కూనారం సర్పంచిగా, పెద్దపల్లి సమితి ప్రెసిడెంట్‌గా, పెద్దపల్లి నియోజకవర్గానికి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని గుర్తు చేశారు. అభివృద్ధి అంటేనే గిట్ల ముకుంద రెడ్డి అని, ముకుంద రెడ్డి అంటేనే అభివృద్ధి అని ఆయన సేవలను కొనియాడారు. రాబోయే 13వ వర్ధంతి వరకు సుల్తానాబాద్ లో మాజీ ఎమ్మెల్యే గిట్ల ముకుంద రెడ్డి విగ్రహావిష్కరణ ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, పెద్దపల్లి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంకెన రవీందర్, ఏ జి పి ఉప్పురాజు, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పెద్దపల్లి జిల్లా లైబ్రరీ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే గిట్ల ముకుంద రెడ్డి తనయుడు రాజేందర్ రెడ్డి, కౌన్సిలర్ గుజ్జుల కుమార్, మాజీ తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు అక్కపాక తిరుపతి, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి టౌన్ ప్రెసిడెంట్ భూషణ వేణి సురేష్ గౌడ్, కౌన్సిలర్ మంతని నర్సింగ్, వివిధ పార్టీల నాయకులు కుంభం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎండలోనే పరీక్షల యుద్ధం

**లింగాపురం మోడల్ స్కూల్ వద్ద రద్దీ దృశ్యం**

గోదావరిఖని ,ప్రభాతవార్త;

అంతర్గం మండలం లింగాపురం మోడల్ స్కూల్‌లో జరుగుతున్న పరీక్షల నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచే విద్యార్థులు, తల్లిదండ్రులతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. పరీక్షల సమయం దగ్గరపడు తుండటంతో విద్యార్థులను తీసుకువచ్చిన తల్లిదండ్రులు ఎండను లెక్కచేయకుండా గంటల తరబడి బయటే వేచి ఉన్నారు.పాఠశాల ప్రధాన గేటు వద్ద పెద్ద సంఖ్యలో బైక్‌లు, వాహనాలు నిలిచిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పిల్లల భవిష్యత్తుపై ఆందోళనతో తల్లిదండ్రులు గేటు వద్దకు చేరుకుని పరీక్షల సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేశారు. కొందరు చెట్ల నీడలో తలదాచుకోగా, మరికొందరు వేడిని



తట్టుకోలేక ఇబ్బందులు పడ్డారు.ప్రస్తుత ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో చిన్నారులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా తగిన సౌకర్యాలు కల్పించాలని, ముఖ్యంగా తాగునీరు, నీడ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.ఇలాంటి పరిస్థితులు ప్రతి పరీక్షా సమయంలో పునరావృతం అవుతున్నాయని, ముందస్తు ఏర్పాట్లు ఉంటే తల్లిదండ్రులకు ఉపశమనం కలుగుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

# రాష్ట్రస్థాయి సెస్టోబాల్ క్రీడల్లో సత్తా చాటిన గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

జగిత్యాల జిల్లా మల్యాలలో తెలంగాణ రాష్ట్ర సెస్టోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆదివారం జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొన్న



విద్యార్థులు ఎస్. వరసిద్ధు, కే. శ్రీనాథ్, సాయి చరణ్, జశ్వంత్, మహేందర్, సుప్రీత్ తమ క్రీడా నైపుణ్యంతో రాష్ట్రస్థాయి ప్రశంస పత్రాలను అందు కున్నారు. ఈ పత్రాలను తెలంగాణ సెస్టోబాల్ అసోసియేషన్ బాధ్యులు ఓదెల్ యాదవ్ విద్యార్థులకు అందజేశారు. విద్యార్థుల విజయం పట్ల గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో జాతీయస్థాయికి కూడా అర్హత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల క్రీడా ప్రతిభను అభినందించిన వారిలో పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్, వ్యాయామ ఉపాధ్యాయుడు అజయ్ కుమార్, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

# ఓదెల మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ఓదెల, ప్రభాతవార్త:



పెద్దపల్లి జిల్లాలోనే అతిపెద్ద ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది ఆలయం పరిసర ప్రాంతాలలో భక్తుల రద్దీ నెలకొంది జాతర దినం ఆదివారం కావడం వలన రాష్ట్రం నలుమూలల నుండి అలాగే వివిధ జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి శ్రీ మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు ఆలయం పరిసర ప్రాంతాలలో ఎక్కడ చూసినా భక్తుల రద్దీ ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు పట్నాలు బోనాలు పుట్టు వెంట్రుకలు కోడెను కట్టుట తోపాటు ఇతర మొక్కులను చెల్లించుకొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు ఓదెల మల్లన్న ను కోరుకొగానే కొంగు బంగారం చేసే దేవుడు ఓదెల మల్లన్న అని భక్తులు అంటారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఆలయ ఈవో బి సదయ్య,ఆలయ జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి తగు ఏర్పాట్లు చేశారు.

# బాధిత కుటుంబానికి ఎల్ఓసి అందజేసిన ప్రేమ్ సాగర్ రెడ్డి

ఓదెల, ప్రభాతవార్త:

ఓదెల మండలంలోని భీమరపల్లి (చిన్న కొమురె) గ్రామస్తులైన తొట్ల తిరుపతి కిడ్నీ సమస్యతో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న విషయం సర్పంచ్ రంగు మల్లేష్ గౌడ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు కు తెలపడంతో రెండు లక్షల ఎల్ఓసి పంపించగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆదివారం రెండు లక్షల ఎల్ఓసి ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి భీమరపల్లి సర్పంచ్ రంగు మల్లేష్ గౌడ్ ఉప సర్పంచ్ లింగయ్య వారికి అందజేశారు ఈ సందర్భంగా ప్రేమ్ సాగర్ రెడ్డి మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వం అని పేదలను ఆపదలో ఎప్పటికీ ఆదుకునే ప్రభుత్వం అని అన్నారు అలాగే తొట్ల తిరుపతికి చికిత్స కోసం రెండు లక్షల ఎల్ఓసి ని ఇప్పించిన మన ప్రియతమ నాయకుడు విజయ రమణారావు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు



# పెద్దపల్లి వార్త

# కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను మోసం చేసింది

**తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షులు మట్టా రాజయ్య**

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విస్మరించిందని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మట్టా రాజయ్య మండిపడ్డారు. ఈ నెల 22న హైదరాబాద్ లోని గాంధీ భవన్ ఎదుట భిక్షాటన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆదివారం వెల్లడించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి ఇప్పుడు మోసం చేసిన ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని మట్టా రాజయ్య హెచ్చరించారు. ఈ నిరసనలో పాల్గొనేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు సిద్ధం కావాలని మట్టా రాజయ్య, మట్టా రాధ, శీలం శంకర్, కట్టకోల మధు, బండ సురేష్, కళ్ళెం లక్ష్మణ్, పంతకాని రవి, సాంబశివరావు పిలుపునిచ్చారు.

# ప్రకాష్ రాజ్‌పై చర్యలు తీసుకోవాలి

**-బీజేపీ నేతల ఫిర్యాదు**

సుల్తానాబాద్,ప్రభాతవార్త:



ప్రముఖ సినీనటుడు ప్రకాష్ రాజ్ హిందూ ఆరాధ్య దేవతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు సమర్పించారు.ఈ సందర్భంగా కందుల శ్రీనివాస్ మాట్లాడుతూ,ఇటీవల కేరళలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకాష్ రాజ్ లార్డ్ రామ, సీత, లక్ష్మణులపై అనుచిత వ్యాఖ్యలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు.రామాయణం నేపథ్యాన్ని తప్పుగా వివరించడం ద్వారా అవమానకర వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు సమాజంలో అసహనాన్ని పెంచే ప్రమాదం ఉందని అన్నారు.గతంలో కూడా ప్రకాష్ రాజ్ ఇలాంటి వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేస్తూ, ఆయనపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి కామిని రాజేంద్రప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరు సంతోష్ కుమార్, మేకల కిరణ్, చిట్టవేణి సదయ్య, ఆగండ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గిట్ల వర్ధంతి

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:

మండలంలోని కూనారం గ్రామంలో పెద్దపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గిట్ల ముకుంద రెడ్డి 12 వ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కూనారం గ్రామంలో మహనీయునికి పూల మాలల వేసి నివాళులు అర్పించడం అర్పించారు అనంతరం నాయకులు మాట్లాడుతూ.. పెద్దపల్లి నియోజక వర్గ అభివృద్ధికి ముకుంద రెడ్డి చేసిన ఎనలేని సేవలను అభిమానులు నాయకులు,గుర్తుచేసుకున్నారు. కూనారం గ్రామ సర్పంచ్ మంతెన రాజయ్య ఉప సర్పంచ్ బోడకుంట్ల తిరుపతి మాజీ ఎంపీపీలు నూనేటి సంపత్ యాదవ్వొట్టె సుజాతరవీందర్ కూనారం పిఎసిఎస్ మాజీ చైర్మెన్ కొట్టె సమ్మయ్య మాజీ ఎంపీటీసీకొల్లూరి రమాదేవి రాజమల్లు,వార్డు మెంబర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# రామ మందిర ధ్వజస్తంభానికి రూ, 2,01,117 విరాళం అందజేత

మల్యాల /ప్రభాతవార్త

మల్యాల మండల కేంద్రంలో భారీ ఎత్తున నిర్మించ తలపెట్టిన శ్రీ రామ మందిర నిర్మాణం కోసం పలువురు భక్తులు పెద్ద మొత్తంలో విరాళాలు అందజేస్తున్నారు, ఈ మేరకు మల్యాల కు చెందిన భూక్య స్వర్ణలత రాజేందర్ (సింగపూర్), మంగీలాల్ ఆలయ ధ్వజస్తంభానికి భారీ మొత్తంలో రూ,2,01,116 ల విరాళాన్ని రామ మందిరం నిధుల సేకరణకమిటీ



సమక్షంలో అందజేశారు, ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ ఎల్లాల జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ, మల్యాల లో సుమారు 2 నుండి 3 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన శ్రీ రామ మందిరం నిర్మాణా నికి ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందని, పలువురు స్వచ్ఛందంగా విరాళాలు అందజేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు, కార్యక్రమంలో రామ మందిరం నిర్మాణ కమిటీ కార్యనిర్వహక సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు,

## ప్రశాంతంగా నూక పల్లి ఆదర్శ పాఠశాల లో ప్రవేశ పరీక్షలు

మల్యాల /ప్రభాతవార్త



మల్యాల మండలం నూక పల్లి ఆదర్శ పాఠశాలలో6, 7,8,9,10 తరగతులలో విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గుమ్మడి ఆదిత్య తెలిపారు, పాఠశాల లో ఉదయం పూట జరిగిన 6 వ తరగతి ప్రవేశ పరీక్ష కు114 మంది విద్యార్థులకు గాను 97 మంది హాజరుకాగా 17 మంది గైర్హాజర్ అయినట్లు ప్రిన్సిపాల్ ఆదిత్య తెలిపారు, మధ్యాహ్నం నిర్వహించిన 7,8,9,10 తరగతుల ఎంట్రన్స్ కి మొత్తం 52 మందికి విద్యార్థులకు గాను 47 మంది విద్యార్థులు హాజరైనట్లు, ఐదుగురు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు, కాగా, సాయంత్రం జిల్లా విద్యాధికారి రాము పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు,

## ఆదర్శంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చొప్పదండి,ప్రభాతవార్త:



50 సంవత్సరాల క్రితం చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ పూర్వ విద్యార్థుల స మ్మే ళ నం నిర్వహించడం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని రిటైర్డ్ ఉపాధ్యాయుడు గుర్రం భూమారెడ్డి, కటకం భూమయ్య, రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ వెల్మ మల్లారెడ్డి లు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మంగళపల్లి గ్రామంలో 1997 బ్యాచ్ చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళపల్లి గ్రామంలో ఏనుగు స్వామి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానం చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు చేయడం అభినందియమని కొనియాడారు.ఇప్పటి కాలంలో ఉపాధ్యాయులను గుర్తించడం విద్యార్థులు మరిచిపోయారని 50 సంవత్సరాలు క్రితం చదువుకున్న విద్యార్థులు ఉపాధ్యాయులను గుర్తించడం అభినందనమని పేర్కొన్నారు. ఇప్పుడున్న కాలంలో విద్యార్థులు మంచి భవిష్యత్తును ఎంచుకొని బావి భారత పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, మాజి సర్పంచ్ వెల్మ నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి,నాయకులు ఏనుగు స్వామి రెడ్డి,గాండ్ల లక్ష్మణ్,పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిభిరం

రామడుగు, ప్రభాతవార్త :

రామడుగు మండలంలోని గోలి రామయ్య పల్లె గ్రామంలో కరీంనగర్ వెంకటాద్రి హాస్పిటల్, డాక్టర్ తోంగూరి కార్తీక్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ నునుగొండ అంజలి ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామ ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో ఉచితంగా షుగర్ ,యూరిక్ ఆసిడ్, బి ఎం డి, పి ఎఫ్ టి తదితర టెస్టులను ఉచిత పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ వైద్య శిబిరానికి దాదాపు 200 మంది హాజరయ్యారన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వి ,అరుణ్, డాక్టర్ అర్చన, డాక్టర్ మేఘన, డాక్టర్ వరలక్ష్మి ్మ, డాక్టర్ తన్వీర్, డాక్టర్ ఆశిష్ తో పాటు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## ఓబీ పనులను అడ్డుకున్న రాజపూర్ గ్రామస్తులు

రామగిరి ప్రభాతవార్త



రామగుండం ఆర్ జి 3 పరిధిలోని ఓసిపి 2 ప్రాజెక్టులో జరుగుతున్న ఓబీ పనులను ఆదివారం రాజపూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. ప్రాజెక్టు లో భాగంగా సి5 కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్వారీ పనుల సమయంలో జరుగుతున్న బ్లాస్టింగ్ కారణంగా భారీగా దుమ్ము ధూళి వ్యాపిస్తుందని గ్రామస్తులు అగ్రం వ్యక్తం చేశారు. ఈ దుమ్ము కారణంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని రోజువారి జీవనం దెబ్బతింటుందని వారు ఆరోపించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అలాగే పంటలపై దుమ్ము దూళి పడి తీవ్రంగా నష్టపోతున్నామని గ్రామస్తులు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకోకుండా నిరక్ష ్యంగా పనులు కొనసాగిస్తున్నారని ఆరోపిస్తూ శాశ్వత పరిష్కారం చూపేవరకు పనులు నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా బ్లాస్టింగ్ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం నీటిని స్ప్రే చేయడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులతో చర్చలు జరిపి వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసు కుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు తమ ఆందోళన విరమించారు.

## నిర్మాణ కార్మికులకు తలపాగాలు (టవల్స్) పంపిణీ

రామగిరి ప్రభాతవార్త



అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా సెంటనరీ కాలనీలో ఎండలో పనిచేస్తున్న కార్మికులకు తలపాగాలు (టవల్స్) భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి తమ సొంత ఖర్చులతో 30 మంది కి ఆదివారం పంపిణీ చేశారు.ఎండలో పనిచేస్తున్నప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని, పనివేళలో మార్పులు చేసుకోవాలని సూచించారు. నెత్తికి తలపాగా,టోపీ, ధరించాలని, చల్లని నీరు లేదా మజ్జిగ, ఓఆర్ఎస్ త్రాగాలని ఎండ వేడికి వడదెబ్బ తగలకుండా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. బైరి శంకర్, ఎస్.కె షరీఫ్, వెంగళ రాములు, కాల్వ కొమురయ్య పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎంప్లాయిస్ టీచర్స్ యూనియన్ కోరుట్ల శాఖ అధ్యక్షునిగా రాజేంద్ర ప్రసాద్

కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :



తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ టీచర్స్ అసోసియేషన్ కోరుట్ల శాఖ అధ్యక్షునిగా గడ్డం రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవంగాఎన్నికయ్యాడని తెలంగాణ రాష్ట్ర ట్రీటా అధ్యక్షులు పీఎస్ వినోద్ కుమార్ తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా రుద్ర మాణిక్యం, ముఖ్య సలహాదారుడుగా మేడి కిషన్, ఉపాధ్యక్షులుగా చక్కరి వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా రాజేశ్వరరావులు ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రీట అధ్యక్షులు పీఎస్ వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి పూరి వెంకటయ్య, రిటైర్డ్ టీచర్స్ ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

# చొప్పదండి వార్త




## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న సమాచార కమిషనర్

మల్యాల/ ప్రభాతవార్త



ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయం కు ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సమేతంగా సందర్శించి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం శ్రీ స్వామివారి సన్నిధిలో పూజలు జరిపి కమిషనర్ ర్ కు స్వామివారీ శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు, కార్యక్రమంలో మల్యాల ఎస్ఐ నరేష్ కుమార్ ఆలయ ఇన్స్పెక్టర్ అశోక్ , అర్చకులు పాల్గొన్నారు

## వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

### మద్దుట్ల సర్పంచ్ సంకుర్తి తిరుపతి

మల్యాల /ప్రభాతవార్త



మల్యాల మండలంలోని మద్దుట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులు పండించిన వరి ధాన్యం ను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేపట్టాలని మద్దుట్ల గ్రామ సర్పంచ్ సంకుర్తి తిరుపతి కోరారు, ఆదివారం ఆయన గ్రామంలోని కొనుగోలు కేంద్రాల వద్ద తరలించిన దాన్యం రాశులను పరిశీలించారు, ఇప్పటికే రైతుల పొలాలలో దాదాపు 70 శాతం వరి కోతలు పూర్తయ్యాయని, దీంతో గ్రామానికి చెందిన ఐకెపి , గ్రామ అగ్రికల్చర్ మార్కెటింగ్ సెంటర్ లలో రైతులు తమ ధాన్యాన్ని తరలిస్తున్నారని , రెండు కేంద్రాలలో దాన్యం నిండిపోయిందని సర్పంచ్ తిరుపతి అన్నారు, అయితే వాతావరణ మార్పులు దృష్ట్యా రాబోయే ఐదు రోజులు అకాల వర్షాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని రైతులు నష్టపోకుండా వెంటనే అధికారులు కేంద్రాలను వెంటనే ప్రారంభించి దాన్యం కొనుగోలు చేపట్టాలని ఆయన కోరారు, రైతులు కెలేటి రాజేష్, తోట రవి, వడ్నాల చంద్రయ్య, కుసరి ప్రభాకర్, సంకుర్తి వెంకటేష్, మునుగోటి సత్యంరావు, కట్ట రవి పాల్గొన్నారు,

## కెసిఆర్ జగిత్యాల సభను విజయవంతం చేయాలి

మల్యాల / ప్రభాత వార్త



బి ఆర్ ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 20 న తలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మల్యాల మండల బిఆర్ఎస్ అధ్యక్షులు జనగాం శ్రీనివాస్ కోరారు, సోమవారం సాయంత్రం 5 గంటలకు జగిత్యాల పాత బస్టాండ్ లోని కాలేజీ గ్రౌండ్ లో జరిగే భారీ బహిరంగసభ కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో పాటు కేటీఆర్, హరీష్ రావు, మాజీ మంత్రులు, నాయకులు హాజరవుతారని, నిర్ణీత సమయానికి ముందుగానే కార్యకర్తలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు,

# పండించిన పంట చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

## -రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి ప్రభాత వార్త :



రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం రుద్రంగి మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై అడిషనల్ కలెక్టర్ నగేష్ తో కలసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. రైతులు పండించిన వరి ధాన్యానికి మద్దతు ధరగా గ్రేడ్ఏ రకానికి రూ.2389 చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు పెద్దపీట వేస్తూ నాణ్యమైన విద్యుత్, ఎరువులు, మెరుగైన విత్తనాలను అందిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా రైతులకు ఒకేసారి రుణమాఫీ అమలు చేసినట్లు తెలిపారు. సన్న వడ్లు పండించే రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నామని వెల్లడించారు. పంటపొలాలు ఎండిపోకుండా ఉండేందుకు ఎల్లంపల్లి నీటిని మూడు సార్లు విడుదల చేసినట్లు గుర్తుచేసారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, వారు పండించిన పంటలను చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. అవసరమైతే జిల్లా కేంద్రంలోని గోదాములను వినియోగిస్తామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మిల్లర్లు కూడా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఇక రైతును రాజుగా చేయాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. రుద్రంగి లోని నాగారం చెరువుకు ఎల్లంపల్లి నీటిని మూడు సార్లు విడుదల చేసి రైతులకు మేలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ఏఎంసీ చెర్మెన్ చెలుకల తిరుపతి, సర్పంచ్ గండి నారాయణ, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# పరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

చందుర్తి ప్రభాతవార్త:



రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు, చందుర్తి మండలం మల్యాల గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి తో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చేలు కల తిరుపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రైతులు బాగుపడాలని ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తూ మద్దతు ధర ఇస్తున్నారన్నారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ శారద మాజీ జెడ్పిటిసి నాగం కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, బాణాల రవీందర్ రెడ్డి, ఇందూరి మధు, ఈసరి శ్రీనివాస్, శంకరయ్య, ఏనుగుల లచ్చిరెడ్డి, కరీం రైతులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే

## -ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి



ప్రభాతవార్త కోనరావుపేట:

మద్యం సేవించి వాహనాలు నడిపితే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని కోనరావుపేట ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి హెచ్చరించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్'కార్యక్రమంలో భాగంగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కోనరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరిని న్యాయస్థానంలో హాజరుపరచగా, కేసును విచారించిన న్యాయమూర్తి ప్రవీణ్ నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానావిధిస్తూ తీర్పునిచ్చారు.పట్టుబడిన వారిలో ఇద్దరికి రూ. 5,000 చొప్పున జరిమానా మరియు రెండు రోజుల జైలు శిక్ష విధించగా, మరో ఇద్దరికి రూ. 3,000 చొప్పున జరిమానా మరియు ఒక రోజు జైలు శిక్ష ఖరారు చేశారు. మొత్తంగా నలుగురికి కలిపి రూ. 16,000 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల డ్రైవర్ల ప్రాణాలతో పాటు అమాయక పాద చారులు, ఇతర వాహనదారుల ప్రాణాలు కూడా గాల్లో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రమాదవశత్తు బావిలో పడిన హార్వెస్టర్.. డ్రైవర్ మృతి

పెగడపల్లి, ప్రభాతవార్త:

మండలంలోని నందగిరి గ్రామంలో స్థానికంగా విషాదకర సంఘటన చోటుచేసుకుంది. వరి కోత పనులు జరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు హార్వెస్టర్ యంత్రం సమీపంలోని బావిలో పడిపో వడంతో, దానిని నడుపుతున్న డ్రైవర్ పాలకొల మధు (35) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.సమాచారం అందుకున్న వెంటనే గ్రామస్థులు బావిలో మృతదేహాన్ని వెతకగా బావి లోతు ఎక్కువ ఉండడంతో మృతదేహం కనిపించకపోవడంతో , బావిలో పడిన హార్వెస్టర్ ను ఫ్రోక్లైన్ సహాయంతో బయటకు తీశారు. గజా ఈతగాళ్లు రప్పించి మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.మృతుడు పేద కుటుంబానికి చెందినవాడని గ్రామస్తులు తెలిపారు. అతనికి భార్యతో పాటు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. కుటుంబం ఆర్థికంగా బలహీన స్థితిలో ఉండటంతో, ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# సాగును పండుగ చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## -వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు
## -వేములవాడలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేములవాడ టౌన్, ప్రభాతవార్త:



వేములవాడ నియోజకవర్గ రైతాంగం ఆర్థికంగా బలోపేతం కావాలని, సాగును పండుగలా మార్చాలన్నదే స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రధాన ఆశయమని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. వేములవాడ పట్టణంలోని బాలనగర్‌లో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ రైతాంగానికి సాగునీరు అందించడంలోనూ, పండించిన పంటను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలన్న సంకల్పంతో ఊరూరా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన తాగునీరు, నీడ, గోనె సంచులు వంటి అన్ని వసతులను అధికారులు సిద్ధం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికారపు రాకేష్, డైరెక్టర్లు, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్, వ్యవసాయ సహకార సంఘం అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# వేములవాడ వార్త

# డిజిటల్ బోధనలో నవత పాఠశాలకు జాతీయ అవార్డు

## -కరస్పాండెంట్ నాగరాజుకు అభినందనలు

చందుర్తి ప్రభాతవార్త:




చందుర్తి మండల కేంద్రంలోని నవత ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రొపెల్ డిజిటల్ బోధనలో వరుసగా రెండవ సారి జాతీయ ఉత్తమ పాఠశాల గా నిలిచింది, పాఠశాల కరస్పాండెంట్ పత్తిపాక నాగరాజు లీడ్ గ్రూప్ అధినేత, ప్రొపెల్ సీఈవో సుమిత్ మెహతా చేతుల మీదుగా హైదరాబాదులోని నోవోటల్ హోటల్లో అవార్డు అందుకున్నారు ... దాదాపు 9వేల ప్రొపెల్ పాఠశాలలో నవత విద్యాలయం వరసగా రెండుసార్లు జాతీయ ఉత్తమ పాఠశాల అవార్డు అందుకోవడం అభినందనీయం, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా డిజిటల్ విద్యను అందజేస్తూ ఉత్తమ ఫలితాలు ఫలితాలు సాధించడంతో , వరుసగా రెండు సంవత్సరాలుగా అవార్డు పొందడంలో పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు, నవత విద్యాలయం యాజమాన్యం,అధ్యాపక బృందం ఇదే విధంగా కష్టపడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి విద్యను అందజేస్తూ భవిష్యత్తులో మరిన్ని వార్డులు పొందాలని ప్రొఫైల్ గ్రూప్ ప్రతినిధులు కొనియాడారు.

# వేములవాడ పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

వేములవాడ టౌన్, ప్రభాతవార్త :



వేములవాడ పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులుగా రాంపెల్లి వెంకటరమణ. ఉపాధ్యక్షులు గా కొక్కుల శ్రీనివాస్, వాసం భూమేశ్వర్, నడిగట్ల బిక్షపతి, నాగుల విష్ణు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గా తాటికొండ రాజు క్యాషియర్ గా రాపెల్లి శ్రీధర్. సహాయ కార్యదర్శి గా అంబటి గంటాద్రి, వాసం వెంకటస్వామి నీ ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి బూర సదానందం తెలిపారు.అలాగే సంఘం గౌరవ అధ్యక్షులుగా తాటికొండ రాజయ్య, తాటికొండ శంకరయ్య అవధూత రజినీకాంత్ ప్రచార కార్యదర్శిగా కోనమ్మ గారి రాము,కార్యవర్గ సభ్యులుగా కొండబత్తినీ రాజేందర్,వేముల గంగాధర్,కోడం గణేష్ ,గుజ్జె మనోహర్,మంత్రి రమేష్,అంబటి బాలాద్రి,వేముల భాస్కర్,చిందం లక్ష్మణ్, కొండబత్తిని సత్యం,దోర్నాల రాము,అల్లాడి శ్రీనివాస్,వేముల రమేష్. మీడియా కన్వీనర్ గా కట్టెకోల రాంప్రసాద్ కోఆప్షన్ సభ్యులుగా దాసరి దేవేందర్, సిరిమల్లె శ్రీనివాస్, వేముల రమేష్, వాసాల నరేందర్, భోగ మధు, బండారి రమేష్ ,కొక్కుల వేణుగోపాల్, బిల్లా కృష్ణ హరి, తడిగొప్పుల బాలరాజు, పెండెం కిష్టయ్య, గౌరవ సలహాదారులుగా నాగుల సత్యనారాయణ, కొక్కుల బాలకృష్ణ, వాసాల శ్రీనివాస్, గూడూరి మధు, ఎల్లా పోశెట్టి, తాటికొండ రామస్వామి, రాపల్లి శ్రీధర్ లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఆదివారం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, కుల బాంధవులు పాల్గొన్నారు.

# రైతులను తప్పుదారి పట్టిస్తున్న బిఆర్ఎస్ పార్టీ

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న

మంథని ప్రభాతవార్త:

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మార్కెట్ యార్డులో కి వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రతిపక్ష టిఆర్ఎస్ పార్టీ చేసే తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న తెలిపారు.ఆదివారం మంథని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారురాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని వెంకన్న కొనియాడారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మంత్రి ఇప్పటికే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని, కలెక్టర్ ఆధ్వర్యంలో కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రైతుల పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి వారికి మద్దతు ధరను అందిస్తామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మిల్లుల వద్ద తరుగు పేరుతో జరిగిన దోపిడీకి ఈ ప్రభుత్వం అడ్డుకట్ట వేసిందని, మిల్లుల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఊరటనిచ్చిందని పేర్కొన్నారు.ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తుంటే, ఓర్వలేక ప్రతిపక్షాలు అర్థం లేని విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు



మానుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమం కోసం పెట్టుబడి సహాయం, రైతు బీమా వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. సోమవారం కాటారంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభకు మంథని నియోజకవర్గం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముస్కుల ప్రశాంత్ రెడ్డి, డైరెక్టర్ లు మంథని సదానందం, కనబోయిన ఓదెలు, ఎండీ అంకుస్, రేగల్ల రామ్మోహన్ రావు, ఉదరి శంకర్, రావికంటి వెంకటేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కాంగ్రెస్ నాయకులు మబ్బు తిరుపతి గొల్లపల్లి శ్రీనివాస్, అక్కపాక సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మంథని వార్త



## శ్రద్ధాంజలి ఘటించిన కాంగ్రెస్ నాయకులు

రామగిరి ప్రభాతవార్త:



పలువురు కాంగ్రెస్ నాయకులు వైనాల రాజయ్య పార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు పెద్దనాన్న ఐకెపి సీసీ వైనాల బాపు తండ్రి వైనాల రాజయ్య ఆదివారం అనారోగ్యం కారణంగా మరణించారు. వారి స్వగ్రామం అయినా కమాన్ పూర్ మండలం జూలపల్లికి వెళ్ళిన పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య , మాజీ జడ్పిటిసి గంట వెంకట రమణారెడ్డి , మాజీ ఎంపీటీసీ ముస్త్యాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ సిద్ధం మురళీ కృష్ణ, గుగులోత్ ప్రవీణ్, ఆరెల్లి శ్రీనివాస్, లు వైనాల రాజును, వైనాల బాపును పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపాలి

మంథని రూరల్ ప్రభాతవార్త:



ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే విధంగా ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బూడిద గణేష్ కోరారు. ఆదివారం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంథనిలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి మంథనిలోని అన్ని కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మహాలక్ష్మి ్ర స్కీంను ఆర్టీసీ కార్మికులు విజయవంతం చేస్తున్నారని, ఈ క్రమంలో వారు అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. సమ్మె కార్మికుల హక్కు అని, దానిని నిర్వీర్యం చేసే చర్యలు ప్రభుత్వం విడనాడాలని అన్నారు .విద్యుత్ బస్సుల పేరుతో కార్మికులను ఇతర రీజియన్లకు పంపే చర్యలను మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల ఉద్యమానికి ఎల్లవేళలా అండగా ఉంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మంథని లింగయ్య తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వేల్పుల సురేష్ , కార్మిక సంఘం నాయకులు సర్వర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సింగిరెడ్డిపల్లెలో భూలక్ష్మి మా లక్ష్మి బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం

**రామగిరి ప్రభాతవార్త** రామగిరి మండలం జల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని సింగిరెడ్డి పల్లె గ్రామంలో సోమవారం భూలక్ష్మి మహాలక్ష్మి సహిత బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ తాండ్ర యమునా శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీ ఏలువాక ఓదెలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం తో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని అలాగే 21 తేదీన సల్ల అంబలి దేవుడికి సమర్పణ, 22 తేదీన పోచమ్మ కొలుపు 23 తేదీన బలిదానం ఉంటుందని కావున అధిక సంఖ్యలో భక్త జనులు హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# పిహెచ్‌డి సాధించిన జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ నరహరి



రామగిరి ప్రభాతవార్త:

రామగిరి మండలం సెంటినరీ కాలనీలో గల మంథని జేఎన్టీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న నరహరి అజ్మీర పీహెచ్డీ పట్టా పొందారు.కాకతీయ విశ్వవిద్యాలయం, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ వి భాగం నుండి నరహరి అజ్మీరకు పీహెచ్.డి లభించింది. వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ నుండి నర హరి అజ్మీర పీహెచ్.డి పట్టా పొందారు. డా. పి. కామాక్షి మార్గ దర్శకత్వంలో ఆయన పరిశోధన పూర్తి చేశారు.డీప్ లెర్నింగ్ విధానాలను ఉపయోగించి ప్రొడక్ట్ రివ్యూల ఆధారంగా భావ విశ్లేషణ ( సెంటిమెంట్ అనాలసిస్) అనే అంశంపై ఆయన పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధన కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్), సహజ భాషా ప్రక్రియ (న్యాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్) రంగాలకు సంబంధించినది.నర్సంపేట మండలం, కమ్మపల్లి గ్రామంలోని చెక్రం తండాకు చెందిన నరహరి అజ్మీర, సాధారణ రైతు కుటుంబానికి చెందినవారు. ఆయన తల్లిదండ్రులు అజ్మీర నర్సయ్య, చిలకమ్మ ఉన్నారు.ప్రస్తుతం జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, మంథని లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.ఈ సందర్భంగా తన గైడ్ డా. పి. కామాక్షికి,విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, డీన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్, ప్రిన్సిపల్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ వారికి కృతజ్ఞతలు తెలి పారు.అలాగే తన తల్లి దండ్రులు అజ్మీరా నర్సయ్య, చిలకమ్మ మరియు భార్య కల్పనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా సహ చరులు, మిత్రులు ఆయనను అభినందించారు.

## ఉద్యోగాల కోసం పనులను అడ్డుకున్న రచ్చపల్లి గ్రామస్తులు

మంథని రూరల్ ప్రభాతవార్త :



ఓసీపీ2లో సి5 కంపెనీలో ఉద్యోగాల కోసం ఆదివారం రచ్చపల్లి గ్రామ ప్రజలు పనుల అడ్డుకున్నారు.ఓసిపి 2లో సి5 కంపెనీలు తమకు చెందాల్సిన ఉద్యోగాలు తమకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామస్థులను అడ్డుకొని అధికారులతో చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో రచ్చ పల్లి మాజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్ , మాజీ ఎంపీటీసీ మిర్యాల ప్రసాదరావు తో పాటు పలువురు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధికి దోహద పడాలి

-సర్పంచ్ మంజుల శ్రీనివాస్

రామగిరి ప్రభాతవార్త:



మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధికి దోహద పడాలని చందనాపూర్ గ్రామ సర్పంచ్ కొండ మంజుల శ్రీనివాస్ పటేల్ అన్నారు.స్వయం సహాయక సంఘాల్లో మహిళలు వ్యాపార వేత్తలుగా చేయాలనే లక్ష ్యంతో మంత్రి శ్రీధర్ బాబు సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమం లో భాగంగా ఆదివారం రామగిరి మండలం, చందనాపూర్ గ్రామంలో , ఫ్యాషన్ శిక్షణ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ కొండా మంజులా శ్రీనివాస్ పటేల్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా అభివృద్ధి పరచడమే మంత్రి శ్రీధర్ బాబు ఆశయం అని మహిళా సంఘాలు అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. స్వయంగా మహిళలు శిక్షణ పూర్తి చేసి అనంతరం లోనే వ్యాపార వేత్తలు గా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ మండల కన్వీనర్ పేరాల మహేశ్వరరావు, ఉప సర్పంచ్ రజిత రామ్ చందర్ ,సి.ఓ. రాజేశ్వరి. బాపు, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## ఈనెల 22న గాంధీ భవన్ ఎదుట బిక్షాటన

ఉద్యమకారుల జేఏసి అధ్యక్షులు మట్టా రాజయ్య

**రామగిరి ప్రభాతవార్త** తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల22న గాంధీ భవన్ ఎదుట బిక్షాటన కార్యక్రమం ఉంటుందని జిల్లా లోని ఉద్యమకారులు తరలి రావాలని జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మట్టా రాజయ్య ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో కృషి చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుర్తింపు ఇస్తామని చెప్పి మోసం చేసిందని ఉద్యమ కారుల డిమాండ్ లను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని పేర్కొన్నారు. ప్రకటన తెలిపిన వారిలో జిల్లా మహిళా అధ్యక్షురాలు మట్టా రాధ, ఉపాధ్యక్షులు శీలం శంకర్ , ప్రధాన కార్యదర్శి కట్టేకోల మధు , సుల్తానాబాద్ మండల అధ్యక్షులు బండ సురేష్, కళ్యాం లక్ష్మణ్ , పంత కాని రవి , సాంబ శివ రావు లతో పాటు పలువురు ఉన్నారు.

# ఆగకాశంలో మబ్బులు.. ఆందోళనలో రైతులు

-ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

-తూకం ప్రారంభించని మొక్కజొన్నలు

గొల్లపల్లి, ప్రభాతవార్త:



మండలంలో ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వచ్చే నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో కోతల దశలో ఉన్న పంటలు ఏమవుతాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వరి కోతలు ప్రారంభించిన రైతులు కోసిన ధాన్యాన్ని మండల కేంద్రంలోని మార్కెట్‌తో పాటు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే ఇప్పటికే మార్కెట్ యార్డు ధాన్యం నిల్వలతో నిండిపోయింది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు తీసుకువచ్చిన ధాన్యం అక్కడే పేరుకుపోతూ ఉండటంతో, వర్షం పడితే నష్టం తప్పదనే భయం వ్యక్తమవుతోంది.మరోవైపు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించి దాదాపు పది రోజులు గడిచినా ఇప్పటికీ తూకం ప్రక్రియ ప్రారంభం కాలేదు.కొనుగోలు కేంద్రం ప్రారంభం రోజు మొక్కజొన్నలు తెచ్చిన దీంతో రైతులు తూకం ప్రారంభించకాపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, మబ్బులు కమ్ముకోవడం వంటి అంశాలు రైతుల్లో మరింత ఆందోళనను పెంచుతున్నాయి.ఇప్పటికైనా అధికారులు స్పందించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, తూకం ప్రక్రియను వేగవంతం చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే చేతికొచ్చిన పంట నష్టపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.



మార్కెట్‌కు వరి ధాన్యం తీసుకువచ్చి పది రోజులు అవుతోంది. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రం ప్రారంభం చకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వర్షం పడితే తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుంది అధికారులు తొందరగా కొనుగోలు కేంద్రం ప్రారంభించి తూకం వేయాలి.

-నల్ల రాంరెడ్డి, రైతు గొల్లపల్లి

## ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవ కమిటీ ఏర్పాటు

గొల్లపల్లి,ప్రభాతవార్త:

మండలం లోనిఇస్రాజపల్లి గ్రామంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతజయంతి సందర్భంగా నిర్వహించనున్న హిందూ సమ్మేళన ఉత్సవాల కోసం గ్రామంలోని యువకులు, మహిళలు, పెద్దల సమక్షంలో ఉత్సవ నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు.ఈ కమిటీలో అధ్యక్షులుగా శ్రీ సాన రవీందర్, గౌరవాధ్యక్షులుగా లక్ష్మణస్వామి, ప్రధాన కార్యదర్శిగా అందే రంజిత్ కుమార్, కోశాధికారిగా బైరం రవి ఎంపికయ్యారు. ఈకమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ సోమవారం సాయంత్రం ఇస్రాజపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద హిందూ సమ్మేళన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారుఈ సందర్భంగా ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ ఈ సమ్మేళనంలో పాల్గొని ఆధ్యాత్మిక భావనతో పాటు ఐకమత్యాన్ని చాటాలని కోరారు. "గడపలోపలే కులం, గడప దాటితే హిందువులం – బంధువులం" అనే నినాదంతో సామాజిక సమరసత, ఐక్యతను పెంపొందించేందుకు ఈ ఉత్సవం ఒక వేదికగా నిలుస్తుందని తెలిపారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జూలపల్లి,ప్రభాతవార్త:



జూలపల్లి మండలం వడుకాపూర్‌జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1995 1996 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కరీంనగర్ లోని హోటల్ మై ట్రీ కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా పూర్వ ఉపాధ్యాయులు,హెడ్మాస్టర్ రాజి రెడ్డి,వెంకట్ రెడ్డి,వీరయ్య హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుమారు 40 మంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాళ్ల గత 30 సంవత్సరాల అనుభవాలను పంచుకున్నారు.పదవ తరగతి లో విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించిన సలహాలను పాటిస్తూ ఈరోజు మేము సత్ప్రవర్తన కలిగి ఉండడానికి ఈ హోదాలో ఉండడానికి ఉపాధ్యాయుల మార్గదర్శిని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మితమవుతుంది. ఉపాధ్యాయ వృత్తి మాత్రమే కాదు ఒక బాధ్యత పూర్వ విద్యార్థులు ఇప్పటికి సత్ప్రవర్తన కలిగి ఉండి 30 సంవత్సరాల తర్వాత కూడా ఇంత కలిసిమెలిసి ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహించడం చాలా గొప్ప విషయం అని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజిరెడ్డి,వెంకట్ రెడ్డి,వీరయ్య,పూర్వ విద్యార్థులు దాడి మురళి, తిరుమల్,కిరణ్,చిరంజీవి,రాజు,లత,కళావతి,విజయ,రేణుక తో పాటు పూర్వ విద్యార్థులు 40 మంది పాల్గొన్నారు.భవిష్యత్తులో మరిన్ని సమ్మేళనాలు నిర్వహించడానికి ఇది తోడ్పడుతుందని పేర్కొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

ప్రభాతవార్త కోనరావుపేట



కొనరావుపేట మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు మహిళలు బోనాలు తో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు నైవేద్యం సమర్పించారు పాడిపంటలను గ్రామాన్ని కాపాడాలని అమ్మవారిని వేడుకొన్నారు గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

ఎండపల్లి ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం నుండి సోమవారం రోజున సాయంత్రం 6 గంటలకు జగిత్యాలలో జరిగే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయవలసిందిగా పిలుపు నివ్వడం జరుగుతుంది. మాజీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్, ఆదేశాల మేరకు మన ఎండపల్లి మండలానికి 1500 మంది నాయకులు కార్యకర్తలను తరలి రావాల్సిందిగా వారు చెప్పడం జరిగింది. వారు చెప్పిన విధంగా ఎండపల్లి మండలంలోని 1500 మంది పార్టీ శ్రేణులు సమయానికి సభకు చేరుకొని "కెసిఆర్ ప్రజా ఆశీర్వాద సభ"ను విజయవంతం చేయవలసిందిగా ఎండపల్లి మండల నాయకులకు కార్యకర్తలకు పార్టీ శ్రేణులకు ఎండపల్లి మండల పార్టీ అధ్యక్షులు సింహాచలం జగన్ పిలుపునిచ్చి కోరడం జరిగింది.

## మహాలక్ష్మి ఆలయంలో మంత్రి పూజలు

ధర్మపురి,ప్రభాతవార్త:



ధర్మపురి క్షేత్రంలోని శ్రీ మహాలక్ష్మి ్మ ఆలయాన్ని రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం దర్శించుకుని,పూజల్లో పాల్గొన్నారు. స్థానిక భక్తులు దేవాలయం ఆవరణలో సరస్వతి యజ్ఞాన్ని నిర్వహించగా,మంత్రి లక్ష్మణ్ కుమార్ ఇట్టి కార్యక్రమానికి హాజరై పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ధర్మపురి నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి దయ ఉండాలని ఆయన కోరారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## హిందూ సమ్మేళన ఉప మండల కమిటీ ఏర్పాటు

పెగడపల్లి, ప్రభాతవార్త:

పెగడపల్లి మండల హిందూ సమ్మేళన ఉప మండల కమిటీని ఆదివారం బతికపల్లి ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా మద్దులపల్లి గ్రామానికి చెందిన అంకం రమేష్, గౌరవ అధ్యక్షులుగా బాలయ్య, అంజన్న, ఉపాధ్యక్షులుగా నిమ్మరాజు, మెహన్, శ్రీనివాస్, శంకర్, శారద, ప్రవీణ్, కార్యదర్శులుగా బాబు, తిరుపతి, మురళి, కార్యదర్శులుగా రఘు, లక్ష్మి, జమున, రేణుక, జ్యోతి, వసంతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.






## యమధర్మరాజు ఆలయంలో అభిషేకం

ధర్మపురి,ప్రభాతవార్త



భరణి నక్షత్రం సందర్భంగా ధర్మపురిశ్రీ లక్షీ ్మనరసింహస్వామి దేవ స్థానం అనుబంధ ఆలయమైన యమ ధర్మరాజు దేవాలయంలో అర్చకులు ఆదివారం అభిషేకం నిర్వహించారు. ఉదయం వేళలో స్వామివారికి శ్రీ లక్ష్మీ సూక్తం, మన్య సూక్తంతో అభిషేకం, ఆయుష్య హోమంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం హారతి,మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు, వివిధ ప్రాంతాల నుండి క్షేత్రానికి వచ్చిన భక్తులు యమధర్మరాజు ఆలయంతో పాటు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకుని,పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్,దేవస్థానం అధికారులు,అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

## నృసింహాలయంలో రాష్ట్ర ఆర్టిఐ చీఫ్ కమిషనర్ పూజలు

ధర్మపురి,ప్రభాతవార్త:



ధర్మపురి శ్రీ లక్ష్మీ్మనరసింహస్వామి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఆర్టిఐ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. దేవాలయంలోకి కమిషనర్ రాగానే దేవస్థానం అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతంతో ఆలయంలోకి స్వాగతం పలికారు.అనంతరం దేవాలయంలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి శేషవస్త్రాన్ని వారికి అందించారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం తో పాటు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

## గోదావరి తీరాన శ్రమదానం

-చెత్తను తొలగించిన ప్రజా ప్రతినిధులు,అధికారులు

ధర్మపురి,ప్రభాతవార్త:



ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నది తీరాన ఆదివారం ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఇటీవల భక్తుల తాకిడి పెరగడంతో గోదావరి తీరంలో చెత్త పేరుకుపోయింది. దాంతో మున్సిపల్ పక్షాన శ్రమదానం నిర్వహించడానికి ముందుకు వచ్చి,ఉదయం వేళలో సంతోషిమాత ఘాట్ వద్ద ఉన్న చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ గోదావరి పరిశుభ్రతను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. స్నానానికి వచ్చే భక్తులు గోదావరి తీరంలో చెత్తను వేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్పీలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అకాల చినుకు...రైతుకు వణుకు!.

**కొనుగోలు కేంద్రాలు ప్రారంభం ఎప్పుడో?.**

**రైతుల గోస తీరేదెప్పుడో!**

ప్రభాత వార్త కోనరావుపేట:



ఆరుగాళ్ల శ్రమించే రైతన్నకు అన్ని కష్టాలే ధాన్యం కొనుగోలు జరపక వాతావరణం మబ్బులతో చినుకులు పడుతుంటే రైతు గుండెల్లో గుబులు మొదలైంది ప్రభుత్వం వెంటనే కొనుగోలు ప్రారంభించాలని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కోనరావుపేట మండలంలో ధాన్య కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాకపోవడంతో రైతుల సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఆరగాళ్ల కష్టపడి పండించిన పంటను కోసి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినా, అక్కడ ఎలాంటి కొనుగోలు చర్యలు లేకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. "పంట పండించేవరకు ఒక కష్టం.. అమ్ముకునే సమయానికి మరొక కష్టం" అని రైతులు తమ గోస వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో రైతులు కేంద్రాల ప్రాంగణాల్లోనే ధాన్యాన్ని పోసి ఆరబెట్టి భద్రపరిస్తూ రోజులు గడుపుతున్నారు. సరైన షెడ్లు, తాగునీరు, విశ్రాంతి వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఎండలోనూ, వర్ష సూచనలు ఉన్న వాతావరణంలోనూ ధాన్యాన్ని కాపాడుకోవడం రైతులకు పెద్ద సవాలుగా మారింది.ఇటీవల వాతావరణ మార్పులతో మబ్బులు కమ్మి అక్కడక్కడ వర్షాలు పడుతుండటంతో రైతుల్లో భయం మరింత పెరిగింది. ఏ క్షణమైనా వర్షం పడితే ధాన్యం తడిసి నష్టపోతుందన్న ఆందోళనతో వారు రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు."నెలల తరబడి చేసిన శ్రమ ఒక్క వానతో నాశనం కాకూడదనే భయం వెంటాడుతోంది" అని రైతులు వాపోతున్నారు.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2329 పొందాలనే ఆశతోనే రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నామని తెలిపారు. అయితే కేంద్రాలు ప్రారంభం కాకపోవడం వల్ల మార్కెట్‌లో అమ్ముకునే పరిస్థితి లేక, నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.మండలంలోని అన్ని ధాన్య కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కేంద్రాల్లో తగిన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ధాన్యం తూకం, కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని కోరుతున్నారు. అలాగే కొనుగోలు చేసిన వెంటనే రైతులకు బిల్లులు జారీ చేసి, చెల్లింపులు ఆలస్యం లేకుండా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.రైతులు ఆరు కాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మార్కెట్‌లో పోసి రోజులు గడుపుతూ కాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్న ఈ పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే గమనించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి

**-ముడారి శ్రీనివాస్**



కోనరావుపేట రైతు మండల పరిధిలోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యపు కొనుగోలు కేంద్రాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే ప్రారంభించాలి. కొనుగోలు కేంద్రంలో రైతులకు మౌలిక వసతులు కల్పించాలి. రైతులు ఆరు కాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మార్కెట్లో పోసి పడి కాపులు కాస్తున్నారని అన్నారు. కొనుగోలు చేసిన వెంటనే రైతులకు బిల్లులు పడేవిధంగా కృషి చేయాలని కోరారు.

## ఆర్థిక ఇబ్బందులు ఉన్న రైతు భరోసా విడుదల

- రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, ప్రభాతవార్త:



పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అడ్డగోలుగా చేసిన అప్పులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికరంగా ఉన్న రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 20వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం పెగడపల్లి మండలం ఐతుపల్లి గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన కేవలం రెండు సంవత్సరాలకే మాజీ మంత్రి బీఆర్ఎస్ నేత కేటీఆర్ కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారని, పదేళ్లపాటు అధికారంలో ఉండి అడ్డగోలుగా అక్రమ సంపాదన చేసిన బీఆర్ఎస్ అహంకారం తో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ముఖ్యమంత్రి నీ ఏక వచనంతో మాట్లాడుతున్నారన్నారు.కేటీఆర్ మాటలు దొర అహంకారానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయన్నారు.రబీ సీజన్లో రైతులు పండించిన పంట విక్రయించడానికి ఏలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, అయితుపల్లి గ్రామ సర్పంచ్ మ్యాకల అంజమ్మ మల్లయ్య , తాసిల్దార్ ఆనంద్ కుమార్ , నాయకులు కాసు గంటి రాజేందర్ రావు, కర్ర భాస్కర్ రెడ్డి,ఒరుగల శ్రీనివాస్, పూసాల తిరుపతి, ఇస్లావత్ రవి నాయక్, కడారి తిరుపతి, తడగొండ రాజు, చెట్ల కిషన్, సంఘ ప్రత్యేక అధికారి మల్లేశం, వ్యవసాయ అధికారిశ్రీకాంత్ , సంఘ కార్యదర్శి రవీందర్ రెడ్డి, సంఘ సిబ్బంది, సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారిణి సత్తెమ్మకు కేటీఆర్ ఘన నివాళి

అంత్యక్రియలలో పాల్గొని పాడే మోసిన కేటీఆర్, చెల్మెడ

**వేములవాడ టౌన్, ప్రభాతవార్త:**

వేములవాడ నియోజకవర్గం అగ్రహారానికి చెందిన ప్రముఖ ఉద్యమ కారురాలు తెలంగాణ సత్తెమ్మ మృతి పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తు. ఆమె పార్థివ దేహానికి నివాళులర్పిం చడమే కాకుండా, స్వయంగా పాడె మోశారు.తెలంగాణ మలిదశ ఉద్యమంలో సత్తెమ్మ చురుకైన పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో ప్రతిరోజూ పాల్గొంటూ, "జై తెలంగాణ" నినాదమే ఊపిరిగా జీవించిన ధీరవనిత ఆమె.స్వరాష్ట్ర సాధన కోసం సత్తెమ్మ చేసిన పోరాటం, ఆమె అంకితభావం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కేటీఆర్ కొనియాడారు. వేములవాడ మండలం అగ్రహారం ఆర్ అండ్ ఆర్ కాలనీ లో జరిగిన సత్తెమ్మ అంత్యక్రియలలో కేటీఆర్‌తో పాటు వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహా రావు ,మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ , నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని సత్తెమ్మకు కన్నీటి వీడ్కోలు పలికారు.



# అనాధలైన చిన్నారులకు ఆపద్బాంధవుడైన మర్రి మహేశ్వర్ రెడ్డి

**తల్లిదండ్రులు కోల్పోయి అనాధలుగా మిగిలిన ఇద్దరు సోదరులు**

**విద్య.. వైద్యంకు బాధ్యత తీసుకున్న వన్ హాస్పిటల్ అధినేత మహేష్ రెడ్డి**

**చీకటి జీవితాలకు వెలుగులు నింపిన వైద్యుడి మానవత్వం పై సర్వత్ర హర్షం**



మల్యాల/ప్రభాతవార్త:

చిరుప్రాయంలోనే తల్లిదండ్రులు కోల్పోయి అనాధలుగా మారిన ఇద్దరు సోదరుల గాధను సోషల్ మీడియాలో తెలుసుకున్న ప్రైవేటు వైద్యుడు మానవత్వం చాటుకుని వారి జీవితాలలో వెలుగులు నిం పేందుకు ముందుకు వచ్చారు. ఇద్దరు చిన్నారు లకు విద్యతోపాటు వైద్యం కూడా అందించి వారికి అండగా నిలుస్తానని ప్రకటించారు, వివరాల్లోకి వెళితే, కరీంనగర్ వన్ హాస్పిటల్ అధినేత, ప్రముఖ వైద్యులు మర్రి మహేష్ రెడ్డి ఇటీవల చొప్పదండి మండలం చాకుంట గ్రామంలో తల్లిదండ్రులు కోల్పోయి అనాధలుగా మారిన అభం శుభం తెలియని అన్నదమ్ముల దీనస్థితిని తెలుసుకున్న ఆయన చిన్నారులు అయినవేని ఆదిత్య (10) ఐలవేణి శ్రీనివాస్(8) లను అక్కున చేర్చుకుని వారికి మనోధైర్యాన్ని ఇచ్చి, మీకు తోడుగా నేను ఉన్నాను అంటూ సాధారణ ఖర్చులకు నగదు అందజేశారు, అంతేకాకుండా ఒక కంటి చూపు కోల్పోయిన బాలుడికి వైద్యం తో పాటువీరిద్దరికీ విద్య పరంగా సహాయం అందించేందుకు దత్తత తీసుకుంటున్నట్లు కూడా వైద్యులు మహేశ్వర్ రెడ్డి "ప్రభాతవార్త "తో అన్నారు, ఇదిలా ఉండగా, బాలుర తల్లి లావణ్య మూడేళ్ల క్రితం కిడ్నీలు చెడిపోయి మృతి చెందగా, తండ్రి తిరుపతి కూడా వారం క్రితం అనారోగ్య తో చనిపోయాడు, రక్త సంబం ధికులు నా అనే వారెవరు లేని దుర్భర స్థితిలో మల్యాల మండ లానికి చెందిన కరీంనగర్‌వన్ హాస్పిటల్ అధినేత,వైద్యులు మ హేష్ రెడ్డి ముందుకు వచ్చి ఇద్దరు సోదరుల విద్య, వైద్యం కు భరోసా ఇవ్వడంతో పాటు వారికి మనోధైర్యం కల్పించి మానవత్వం చాటుకోవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు, ఇదిలా ఉండగా, అనాధలైన చిన్నారులకు వీలైనంతవరకు దాతలు, ప్రభుత్వం కూడా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు,

# మట్టి అక్రమాలపై కరువైన రెవెన్యూ నిఘా

**మంథనిలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా**

**ఇష్టారాజ్యాంగా ఎర్ర మట్టి తవ్వకాలు**

మంథని రూరల్ ప్రభాతవార్త :



మట్టి మాఫియా దందా జోరుగా సాగుతుంది అనుమతులు లేకపోయినా పరిమితికి మించి తవ్వకాలు జరుపుతూ, అక్రమంగా మట్టిని తరలిస్తూ పర్యావరణానికి, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.మంథని లో మట్టి మాఫియా అక్రమ మట్టి తరలించడంలో ప్రతి ఆదివారం ఒక రూటు మార్చుతుంది గత వారం గాడుదల గండి సమీపంలో అడవిలోని ఎర్రమట్టిని అక్రమంగా తరలించిన మాఫియా ఈ ఆదివారం బిట్టుపల్లి,రచ్చపల్లి శివారులోని ఎర్ర మట్టిని తరలించడంలో తమ కొత్త వ్యూహాన్ని అనుసరించారు సంబంధిత అధికారుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూముల నుండి సైతం ఎర్రమట్టిని అక్రమంగా తరలించడం జరిగింది గత రెండు వారాలుగా మంథనిలో అక్రమ మట్టి రవాణా కొనసాగుతున్న విషయం పలు పత్రికల ద్వారా రెవెన్యూ అధికారులకు చేరినప్పటికిని రెవెన్యూ అధికారులు స్థానికంగా ఉండకపోవడం వలన అక్రమ మట్టి వ్యాపారస్తులు అదును చూసుకొని ఆదివారం వేళ మట్టిని అక్రమంగా తరలించుకొని సొమ్ము చేసుకుంటున్నారు. మంథని లోని పలు గ్రామాల్లో నూతన గృహ నిర్మాణాలకు,ప్రభుత్వ కార్యాలయాల పనులకు యదేచ్ఛగా అక్రమ మట్టిని తరలిస్తూ రోజు వందల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి ఒక్కో ట్రాక్టర్ కు వెయ్యి నుండి పన్నెండు వందల వరకు తీసుకొని లక్షల గడిస్తున్నారు. అక్రమ మట్టి దందాకు ఎలాంటి అనుమతులు లేకుండానే గుత్తేదారులు అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నారు.ఈ విషయం పై సంబంధిత రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినప్పటికీని అధికారులు స్పందించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం ఇప్పటికైనా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోకపోవడం వెనక ఆంతర్యం ఉందనడంలో సందేహం లేదు. మండల తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో అక్రమ మట్టి దందా నడుస్తున్న అధికారులకు సమాచారం అందించినప్పటికీని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గానీ ఆర్డీవో కార్యాలయ సిబ్బంది గానీ స్పందించకపోవడం చాలా బాధాకరం. ఈ అక్రమ మట్టి రవాణాను సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోని అక్రమ మట్టి రవాణా చేస్తున్న మట్టి మాఫియా పై చర్యలు తీసుకోకుంటే రెవెన్యూ అధికారుల పై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. కాగా ఈ అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్న వారి పై చర్యలు తీసుకొని అక్రమ మట్టి రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్లను జెసిబిలను వెంటనే సీజ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేసాడు.

